సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 27-10-2023 15/-





## బిఆరెస్ Vs కాంగ్రెస్

# ముస్లిం డైలమా?






గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 43 హైదరాబాద్
శుక్రవారం 27 అక్టోబర్ 2023 రూ.15-00
11 రబీ ఉస్సాని 1445 హిజ్రీ

**తొలిగీటు**

అబద్ధం పలకడం ఏ పరిస్థితిలోనూ ధర్మం కాదు. గంభీరంగా గానీ, పరిహాసంగా గానీ అబద్ధం చెప్పకూడదు. మీ పిల్లలకు ఏదయినా ఇస్తామని చెప్పి తరువాత ఇవ్వకపోతే అది కూడా ధర్మం కాదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



16

**దిగజారిపోతున్న నైతిక విలువలు**

# లోపల...

| | | |
|---|---|---|
| ఇస్రాయీల్ పాపం | ...... | 04 |
| బిఆరెస్ Vs కాంగ్రెస్ ముస్లిం డైలమా? | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)– 2 | ...... | 08 |
| పోరుపాట | ...... | 11 |
| యువతరం చైతన్య దీప్తి అబ్దుల్ కలామ్ | ...... | 12 |
| తియ్యని మాటలు స్వర్గానికి బాటలు | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| గాఢాంధకారం – 2 | ...... | 20 |
| గురుశిష్యుల అనుబంధం | ...... | 24 |
| చరితార్థులు–2 : నవాబ్ అలీ ముహమ్మద్ ఖాన్ | ...... | 29 |
| స్నేహం కూడా దైవానుగ్రహమే | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |

**వివక్ష తగదు..**




అగ్ర వర్ణ కులాలకే
అత్యధికంగా సీట్లు
ఉన్నవన్నీ నిజానికి
బహుజన్లవే ఓట్లు!
పార్టీలకు యేమాత్రం
లేదటోయి చిత్తశుద్ధి
ఓటనే ఆయుధంతో
చెప్పండి గట్టి బుద్ధి!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## ఇస్రాయీల్ పాపం

**గాజాలోని** అహ్లీ ఆసుపత్రిపై పడిన మిస్సయిల్ తాము ప్రయోగించలేదని, అది గాజాలోని మిలిటెంట్లు ప్రయోగించిన మిస్సయిలే దారితప్పి ఆసుపత్రిపై పడిందని ఇస్రాయీల్ చెప్పిన మాటను ఇప్పుడు నమ్మే వారెవ్వరు లేరు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కూడా ఇస్రాయీల్ కు వంతపాడుతు, నెతన్యాహు సమక్షంలోనే మాట్లాడుతూ, తన ఇంటిలిజెన్స్ వాళ్ళు చెప్పిన సమాచారం కూడా ఇదేనన్నాడు. గాజా ఆసుపత్రిపై పడిన మిస్సయిల్ మిలిటెంట్లు ప్రయోగించిందే అని చెప్పాడు. ఈ బైడెన్ గారు కొన్ని రోజుల క్రితం నలభై మంది ఇస్రాయీల్ పసిపిల్లల తలలు హామాస్ నరికేసిందని, ఆ ఫోటోలు చూశానన్నాడు. ఆ తర్వాత స్వయంగా శ్వేత సౌధం ముందుకు వచ్చి అలాంటి సమాచారం ఏదీ తమ వద్ద లేదని, ఎలాంటి ఫోటోలు లేవని స్పష్టంచేసి, తమ అధ్యక్షుడి అబద్దాన్ని బట్ట బయలు చేయకతప్పలేదు. కాబట్టి అమెరికా అధ్యక్షుడి మాటల్లో సత్యం ఉందనుకోవడం నేతిబీరలో నెయ్యి ఉందనుకోవడమే.

కాని, ఇస్రాయీల్ చెబుతున్న మాట, దానికి వంతపాడుతూ అమెరికా చెబుతున్న మాటలను తీవ్రంగా ఖండిస్తూ స్వయంగా పాశ్చాత్య మీడియా ముందుకు వచ్చింది. బీబీసీ, చానల్ 4 వంటి మీడియా సంస్థలు ఈ మాటలను ఖండించాయి.

అహ్లీ ఆసుపత్రిపై మేం దాడి చేయలేదని ఇస్రాయీల్ చెబుతున్న మాట లను ఎలా నమ్మగలం? ఎందుకంటే, అహ్లీ ఆసుపత్రి తర్వాత అల్ కుద్స్ ఆసుపత్రిపై ఇస్రాయీల్ బాంబు దాడులు చేసింది. అహ్లీ ఆసుపత్రిపై దాడిలో చాలా మంది మరణించారు కాబట్టి అక్కడ ముఖం చెల్లక ఈ అబద్ధాలు చెప్పింది. తర్వాత మళ్ళీ ఆసుపత్రులపై దాడులు చేయడం కొనసాగిస్తోంది. అలాగే గాజాలో ఉన్న మస్జిదుపై బాంబు దాడులు చేసింది. ఈ మస్జిదులో అనేకమంది ఆశ్రయం పొందారు. మిస్సయిల్ దాడిలో 30 మంది మరణించారు. ఈ మస్జిదు ఉంది నుసేరత్ శరణార్థి శిబిరంలో. శరణార్థులపై కూడా బాంబు దాడులు చేస్తున్న అమానుషం.

నెతన్యాహును కలిసి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆయనకు క్లీన్ సర్టిఫికేటు ఇచ్చి ఆలింగనం చేసుకుని వచ్చాడు. ఆయన నెతన్యాహును ఆలింగనం చేసుకున్న ఫోటో కూడా వచ్చింది. కాని చరిత్ర సిగ్గుపడే సంఘటనగా ఇది నమోదవుతుందని చాలా మంది వ్యాఖ్యానించారు.

అర్థమేమిటంటే, ఇస్రాయీల్ అమానుష దాడులు అడ్డుఅదుపు లేకుండా కొనసాగుతున్నాయి. ఎవరిపై దాడులు చేస్తోంది? ఇస్రాయీల్ పై దాడి చేసిన హమాస్ పై కాదు, సాధారణ పాలస్తీనా ప్రజలపై, ఆసుపత్రులపై, మస్జిదులపై, స్కూళ్ళపై దాడులు చేసి పసిపిల్లలను కూడా చంపుతోంది. గాజా జనాభాలో సగం పిల్లలే. ఇక అహ్లీ ఆసుపత్రి దాడి గురించి చూద్దాం. ఇస్రాయీల్ ఈ దాడి మేం చేయలేదు. ఇది పాలస్తీనా మిలిటెంట్లు ప్రయోగించిన మిస్సయిలే అని చెబుతున్న మాటల్లో నిజమెంత?

ఇస్రాయీల్ ఒక వీడియో విడుదల చేసి గాజా నుంచి వస్తున్న మిస్సయిల్స్ ఇవే చూడండి, ఇందులో ఒక మిస్సయిల్ దారితప్పి అహ్లీ ఆసుపత్రిపై పడిందని వాదించింది. కాని ఇస్రాయీల్ విడుదల చేసిన వీడియోలో, మిస్సయిల్స్ వస్తున్న ప్రాంతంగా చూపించిన ప్రదేశంలో విద్యుచ్ఛక్తి లైట్లు దేదిప్యమానంగా కనిపిస్తున్నాయి. గాజాలో విద్యుచ్ఛక్తి లేదు. ఈ విషయమే చాలా మంది నిలదీసి ప్రశ్నించారు.

ఇస్రాయీల్ ఒక ఆడియో కూడా విడుదల చేసింది. ఇందులో ఇద్దరు మిలిటెంట్లు మాట్లాడుకుంటూ, పొరబాటున ఒక మిస్సయిల్ ఆసుపత్రిపై పడిందని మాట్లాడుకుంటున్న ఆడియో అది. ఈ ఆడియోను బ్రిటన్ కు చెందిన చానల్ 4 వెరీఫై చేసి, ఈ ఆడియో ఫేక్ ఆడియో అని చెప్పింది.

ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమిటంటే, రెండేళ్ళుగా హమాస్ ఇస్రాయీల్ పై దాడికి ఏర్పాట్లు చేసుకుంటుంటే గుర్తించలేని ఇస్రాయీల్ నిఘా సంస్థలు, అహ్లీ ఆసుపత్రిపై దాడి జరగ్గానే ఈ విషయం గురించి మాట్లాడుకుంటున్న ఇద్దరు మిలిటెంట్ల మాటలు రికార్డు చేసి మనకు వినిపించేశాయంటే నమ్మగలమా? బీబీసీ ప్రకారం ఈ దాడి గాజా నుంచి జరిగే అవకాశమే లేదు. దాడి జరిగిన చోట ఉన్న ఆధారాలు పరిశీలిస్తే ఇస్రాయీల్ సైన్యం వైపు నుంచే ఈ దాడి జరిగిందని బీబీసి చెప్పింది. ఆసుపత్రులపై దాడి చేయడం పిల్లలపై దాడి చేయడం ఇస్రాయీల్‌కు కొత్త కాదు. 2022 అగష్టులో ఇస్రాయీల్ దాడిలో ఐదుగురు పాలస్తీనా పిల్లలు చనిపోయారు. ఈ దాడి చేసింది పాలస్తీనా మిలిటెంట్లని ఇస్రాయీల్ మొదట వాదించింది. తర్వాత దాడి చేసింది తామేనని ఒప్పుకోక తప్పలేదు. ఇస్రాయీల్ ఈ విధంగా దాడులు చేసి అమాయకు లను, పసిపిల్లలను చంపడం, తాము ఈ దాడి చేయలేదని వాదించడం, తర్వాత దాడులు చేసింది ఇస్రాయీల్ అని తేలడం ఇలా జరిగిన అనేక సంఘటనలను మేగన్ కే. స్టాక్ అనే జర్నలిస్టు ఒక జాబితానే విడుదల చేశారు. ఉదాహరణకు మే 11, 2022న అమెరికా పౌరుడు అబూ అక్లే హత్య జరిగింది. అతను జర్నలిస్టు. వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై ఇస్రాయీల్ దాడులను కవర్ చేస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. అక్లేను హత్య చేసింది పాలస్తీనా మిలిటెంట్లని మొదట ఇస్రాయీల్ వాదించింది. కాని తర్వాత తెలిసిందేమిటంటే, ఇస్రాయీల్ సైనికుడే అక్లేను కాల్చి చంపాడని రుజువయ్యింది. ఈ మాట స్వయంగా ఇస్రాయీల్ కూడా ఒప్పుకోక తప్పలేదు. ఇలాంటి చాలా సంఘటన లున్నాయి.

అహ్లీ ఆసుపత్రిపై దాడి జరిగిన తర్వాత హనన్యా నఫ్తాలీ అనే అక్కడి జర్నలిస్టు ఈ దాడి ఇస్రాయీల్ చేసిందేనని గొప్పగా ట్వీటు చేశాడు, తర్వాత డిలీట్ చేశాడు. తర్వాత ఈ దాడి చేసింది పాలస్తీనా మిలిటెంట్లని ఒక వీడియో పెట్టాడు. ఆ వీడియో 2022 నాటిదని, అప్పట్లో గాజాలో విద్యుత్ సరఫరా బాగుండేదని, అందువల్లనే లైట్ల వెలుగులు కనిపిస్తున్నా యని చాలా మంది విశ్లేషించి చెప్పారు.

అనేకసార్లు ఇస్రాయీల్ ఇలాంటి దాడులు చేసిందన్నది దృష్టిలో ఉంచు కోవాలి. ఇస్రాయీల్ దుర్మార్గాన్ని ఇప్పుడు యావత్తు ప్రపంచం ఖండిస్తోంది. ✤

అబ్దుల్ వాహెద్



# బీఆరెస్ Vs కాంగ్రెస్
# ముస్లిం డైలమా?

**తెలంగాణాలో** జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆరెస్ ఓడిపోతుందని రాహుల్ గాంధీ జోస్యం చెప్పేశారు. కాంగ్రెసు నిర్వహిస్తున్న విజయ భేరీ యాత్రలో పాల్గొన్న రాహుల్ గాంధీ ఈ మాటలు చెప్పారు. దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణకు మధ్య పోరాటంగా ఆయన రానున్న ఎన్నికలను వర్ణించారు. కాంగ్రెసుకు వ్యతిరేకంగా బీజేపీ, మజ్లిస్ పార్టీలు బీఆరెస్‌కు సహాయపడుతున్నాయని కూడా ఆయన ఆరోపించారు. ఇటీవల రాహుల్ గాంధీ సభకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజానీకం కాంగ్రెసు ఉత్సాహాన్ని ఇనుమడించేలా చేసింది.

ఐదేళ్ళు రాజకీయాల్లో చాలా పెద్ద కాలం. 2018లో కేసీఆర్ నాయకత్వంలోని బీఆరెస్ పార్టీ భారీ మెజారిటీతో తెలంగాణాలో రెండవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాని 2019 సాధారణ ఎన్నికల్లో బీఆరెస్‌కు ఎదురుదెబ్బలు తగిలాయి. మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో సగం మాత్రమే సాధించగలిగింది. బీజేపీ, కాంగ్రెసు పార్టీలు ఊహించినదాని కన్నా మెరుగైన ఫలితాలు సాధించాయి. ఆ తర్వాత బీజేపీ బలపడుతున్న సూచనలు కనిపించాయి. కాంగ్రెసును వెనక్కి నెట్టి బీజేపీ తెలంగాణలో ముందుకు దూసుకుపోతున్నట్లు కూడా కనిపించింది. కాని ఇది కేవలం కొన్ని రోజులు మాత్రమే. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెసు ప్రభంజనం వీస్తున్నట్లు కనిపిస్తోంది. బీజేపీ మూడో స్థానంలో కూడా సుదూరంగా కనిపిస్తోంది. నిజానికి కాంగ్రెసు పార్టీ తెలంగాణలో చావు దెబ్బలు తింది. కాంగ్రెసు నుంచి 12 మంది ఎమ్మెల్యేలు బీఆరెస్ లోకి దూకేశారు. ఏబిపి సి వోటర్ సర్వేలో బీఆరెస్ కు కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తున్నట్లు తెలిసింది. ఒడిశాలో నవీన్ పట్నాయక్ మాదిరిగా మూడవసారి కూడా సునాయాసంగా అధికారం అందుకోవచ్చని ఆశించిన కేసీఆర్‌కు నవంబర్ 30న జరిగే పోలింగ్ గట్టి సవాలు విసిరేలా ఉంది.

తెలంగాణ ఏర్పడిన తర్వాత, అంటే 2014 నుంచి ముఖ్యమైన సమస్యలు ఉద్యమ కాలంలో వినిపించిన నినాదాలే. అంటే నియామకాలు, నీళ్ళు, నిధులు. నిజం చెప్పాలంటే కేసీఆర్ చాలా సమర్థవంతంగా రాష్ట్రాన్ని నడిపించారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఈ సంక్షేమ పథకాల విషయంలో కొన్ని విమర్శలు వినిపించవచ్చు. కాని సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి ఒక స్థాయిలో అమలు చేశారన్నది కాదనలేము. దశాబ్ధకాలంగా ఈ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తున్నారు. అభివృద్ధి చర్యలు తీసుకున్నారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులను పూర్తి చేశారు. ఇవన్నీ

విజయాలుగానే భావించాలి. అక్టోబర్ 15వ తేదీన బీఆరెస్ మానిఫెస్టో విడుదల చేసింది. ఈ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకుపోతామని హామీ ఇచ్చారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 93 లక్షల మందికి 15 లక్షల రూపాయల లైఫ్ ఇన్సూరెన్స్ కల్పిస్తామన్నారు. రేషను దుకాణాల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. వృద్ధులకు పెన్షన్లు పెంచారు. ఒంటరి మహిళలకు, వికలాంగులకు పెన్షన్లు ఇస్తున్నారు. మేనిఫెస్టోలో వీటన్నింటిని మరింత పెంచుతామంటున్నారు. రైతు బంధు, దళితబంధు తదితర కార్యక్రమాలతో తెలంగాణ మోడల్‌ను కేసీఆర్ దేశంలో ప్రచారంలో పెడుతున్నారు. అక్టోబర్ 2022లో అంటే ఒక సంవత్సరం క్రితం కేసీఆర్ తన పార్టీని జాతీయ పార్టీగా పేరు మార్చారు. కాని ఢిల్లీలో కార్యాలయం ప్రారంభించడం తప్ప జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ అడుగు ముందుకు వేయలేదు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావడాన్ని ఆహ్వానించిన పార్టీ జనతాదళ్ సెక్యులర్. ఇప్పుడు ఆ పార్టీ కూడా ఎన్డీయే పంచన చేరింది. ఇది కేసీఆర్‌కు ఎదురుదెబ్బగానే భావించాలి.

రెండుసార్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా పాలించారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత ఉందన్నది నిజమే అయినా ఇప్పటికీ కేసీఆర్ కు ప్రజల్లో పట్టు ఉంది. తెలంగాణ సాధించిన నేతగా గుర్తింపు ఉంది. ప్రజల్లో ఉన్న ఈ గుర్తింపు మాత్రమే ఇప్పుడు బీఆరెస్ విజయానికి ఉపయోగ పడే ఏకైక మార్గం. ఎందుకంటే కాంగ్రెసు ఇప్పుడు మంచి ఊపు మీద ఉంది. కర్నాటక ఎన్నికల్లో లభించిన విజయం గొప్ప ఉత్సా హాన్నిచ్చింది. తెలంగాణలో కూడా అలాంటి ఫలితాలే సాధించాలని చూస్తోంది. మహిళలకు, రైతులకు హామీలు ఇస్తుంది. కుల జనగణన గురించి మాట్లాడుతోంది. విద్యార్థులకు ఆర్థిక సహాయం గురించి చెబుతోంది.

కులజనగణన విషయానికి వస్తే ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న మిజోరంలో కులం పెద్ద సమస్య కాదు. కులగణన జరిపి ఎంతమంది ఓబీసీలున్నారు? ఎంతమంది దళితులున్నారు? ఎంతమంది గిరిజ నులున్నారు? వారి పరిస్థితేమిటి అనే లెక్కలు బయటకు తీస్తామని చెబుతుంది కాంగ్రెస్. తెలంగాణలో కూడా ఇలాంటి కులజనగణన చేయించాలని డిమాండ్ చేస్తోంది. కాని తెలంగాణ కాంగ్రెసులో రెడ్ల సముదాయమే ప్రాబల్యంలో ఉంది. కాంగ్రెసు జారీ చేసిన మొదటి జాబితా అభ్యర్థుల్లోని 55 మందిలో 15 మంది రెడ్డి సముదాయానికి చెందినవారే. ఇదే పరిస్థితి బీఆరెస్‌లో కూడా ఉంది. కాంగ్రెసు పార్టీ ఓబీసీ నేతలను పక్కన పెడుతుందన్న ఆరోపణ తోనే పొన్నాల లక్ష్మయ్య వంటి సీనియర్ నాయకుడు పార్టీ వదిలి వెళ్ళారు. ఆయన బీఆరెస్‌లో చేరవచ్చు. ఇలాంటి పరిస్థితి పార్టీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ మాట్లాడే కులజనగణనను ప్రజలు ఎంతవరకు విశ్వసిస్తారన్నది అనుమానమే. కేసీఆర్ 2014లో సమగ్రసర్వే ఒకటి చేయించారు. అందులో కులపరమైన వివరాలు, సామాజిక ఆర్థిక వివరాలు కూడా సేకరించారు. ఆ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 53.5 శాతం ఓబీసీలు, 18.5శాతం దళితులు, 11.7శాతం ఆదివాసీలు ఉన్నారని తెలిసింది. కాబట్టి తెలంగాణలో ప్రత్యేకంగా కులజనగణన అవసరమా అనే ప్రశ్న కూడా పుడుతుంది.

రాష్ట్రంలో బీజేపీ పూర్తిగా కుదేలయ్యింది. నిజానికి ఉప ఎన్నికల్లోను, హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్లోను బీజేపీ చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించింది. కాని, ఆ తర్వాత పార్టీ గ్రాఫ్ పడిపోయింది. మజ్లిస్ పార్టీ హైదరాబాదుకు మాత్రమే పరిమితమైన పార్టీ. ఎప్పటి మాదిరిగానే మజ్లిస్ తన ఏడు స్థానాలు గెలుచుకోవచ్చు. బీహారు, పశ్చిమబెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో విస్తరించడానికి మజ్లిస్ ప్రయ త్నించింది. కాని ఇప్పుడు తెలంగాణలో మాత్రం కేవలం హైదరా బాదుకు మాత్రమే పరిమితమవుతోంది. కేసీఆర్కు, ఒవైసీకి మధ్య ఈ విషయమై స్పష్టమైన అవగాహన ఉందని చాలా మంది విశ్లేషిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ, వైయస్సార్ తెలంగాణ పార్టీలు కూడా రంగంలో ఉన్నప్పటికీ వాటి బలం పెద్దగా లేదు. బీజేపీ రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధపడడం కేవలం కాంగ్రెసు ఓట్లను చీల్చి బీఆరెస్ కు సహాయపడడానికే అన్న వాదన కూడా వినిపిస్తోంది. కాని ఈ ఎత్తుగడ బెడిసికొట్టి బీఆరెస్ ఓట్లను బీజేపీ చీల్చినా ఆశ్చర్యపోనవసరం లేదని మరి కొందరి విశ్లేషణ.

ఈ నేపథ్యంలో తెలంగాణ ముస్లిములు ఎటు? అనే ప్రశ్నకు రాజకీయ పండితులు కూడా స్పష్టంగా ఏమీ చెప్పలేకపోతున్నారు. రాష్ట్రంలో మతసామరస్యం దెబ్బతినకుండా, అల్లర్లు లేకుండా పాలించిన నాయకుడిగా కేసీఆర్‌కు గుర్తింపు ఉంది. ఈ సంవత్సరం ఆగష్టు నెలలో బీ.ఆర్.అంబేద్కర్ సెక్రటేరియేట్‌ను కేసీఆర్ ప్రారం భించారు. ఈ ప్రాంగణంలో ఒక మస్జిదు కూడా నిర్మించారు. ఈ సెక్రటేరియేట్ నిర్మాణం కోసం 2020లో అక్కడ ఉన్న రెండు మస్జిదులను కూల్చేశారు. ఒక గుడిని కూడా కూల్చారు. మస్జిదులను కూల్చడంపై ముస్లిముల నుంచి తీవ్ర నిరసన వచ్చింది. అలాగే గుడిని కూల్చినందుకు కూడా నిరసనలు ఎదుర్కోవలసి వచ్చింది. కాని, సెక్రటేరియేట్ నిర్మాణంతో పాటు మస్జిదు నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు. మస్జిదు కూల్చినప్పటికీ అక్కడ మళ్ళీ మస్జిదు కట్టించిన నాయకుడిగా కేసీఆర్ ముస్లిములకు పరిచయమయ్యారు. రాష్ట్రంలో ముస్లిం జనాభా 12.6 శాతం ఉంది. మొత్తం రాష్ట్ర జనాభా 3.51 కోట్లు. సెక్రటేరియేట్‌లో మస్జిదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేసీఆర్ తో పాటు మజ్లిస్ నాయకుడు ఒవైసీ కూడా పాల్గొన్నారు. జామియా నిజామియాకు చెందిన ముఫ్తీ ఖలీల్ అహ్మద్ కూడా ఉన్నారు. జామియా నిజామియా 1872 నుంచి నడుస్తున్న ధార్మిక విద్యాసంస్థ. ఈ మస్జిదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఫ్తీలు పాల్గొనడం వల్ల దీనిపై ధార్మికంగా ఎలాంటి అభ్యంతరాలు వచ్చే అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు నలుగురు ముఫ్తీలు అక్కడ పాల్గొన్నారు. ప్రార్థనలు చేశారు. ముఫ్తీ అంటే ధార్మికంగా ఏది సమ్మతమో కాదో చెప్పే వారు, ఫత్వాలు ఇచ్చే యోగ్యత ఉన్నవారు. అలాంటి వారే అక్కడ పాల్గొన్నారంటే

ఇక అభ్యంతరాల అవకాశమే లేదు. ఇదే విషయాన్ని ఒవైసీ కూడా చెప్పారు. కాంగ్రెసు హయాంలో కూల్చిన మస్జిదును నిర్మించలేక పోయారని, కాని బీఆరెస్ కూల్చిన మస్జిదును మళ్ళీ కట్టించిందని కూడా ఆయన బీఆరెస్‌కు మద్దతుగా మాట్లాడారు. మజ్లిస్ పార్టీ నేతలు బీఆరెస్‌కు మద్దతుగా, కాంగ్రెసుకు వ్యతిరేకంగా మాట్లాడు తున్నారన్నది స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఈ నేతల ప్రభావం ముస్లిం ఓటర్లపై ఎంతవరకు ఉంటుందో వేచి చూడాలి. ఎందుకంటే, బీఆరెస్ పట్ల ముస్లిముల్లో అంత వ్యతిరేకత ఏమీ లేదు, కాని కొంత అసమ్మతి తప్పక ఉంది. బీఆరెస్ చాలా వాగ్దానాల విషయంలో విఫలమయ్యింది. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్న అసమ్మతి ముస్లిం సమాజంలో ఉంది. ఈ అసమ్మతిని దూరం చేయడానికి మజ్లిస్ ద్వారా బీఆరెస్ ప్రయత్నిస్తోంది.

బీఆరెస్ ప్రభుత్వం ముస్లిములకు చేసిందేమిటి? ఈ విషయమై ముస్లిముల్లోను చర్చలు జరుగుతున్నాయి. ముస్లిం డిక్లరేషన్ పేరుతో ఒక పత్రాన్ని కూడా కొందరు ఇటీవల విడుదల చేశారు. ఇందులో 12 శాతం రిజర్వేషన్ల విషయంలో బీఆరెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకో లేదన్న విమర్శ ప్రధానంగా కనిపిస్తోంది. 2014లో షాద్ నగర్ వద్ద ఒక బహిరంగ సభలో కేసీఆర్ ఈ హామీ ఇచ్చారు. కేసీఆర్‌పై మరో విమర్శ, శాసనసభలో ముస్లిముల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండడం. 119 నియోజకవర్గాల్లో బీఆరెస్ అభ్యర్థుల్లో కేవలం ముగ్గురే ముగ్గురు ముస్లిములు.

రాష్ట్రంలో ముస్లిముల సామాజిక ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయడానికి కమీషన్ నియమించింది బీఆరెస్ ప్రభుత్వమే. ఈ కమీషనులో ప్రముఖ ఆర్థికవేత్త అమీరుల్లా ఖాన్, విద్యావేత్త అబ్దుల్ సుభాన్‌లు ఉన్నారు. జి.సుధీర్ నాయకత్వం వహించిన ఈ కమీషన్ తన నివేదికను 2016లో విడుదల చేసింది. ముస్లిములకు రిజర్వేషన్లు ఇవ్వవలసిన అవసరం ఉందని ఈ కమీషన్ నివేదిక ఆధారంగా వాదించారు. రాష్ట్రంలో ముస్లిముల జనాభా 12.36 శాతం ఉంటే 23 ప్రభుత్వ విభాగాల్లో ముస్లిం ఉద్యోగులు కేవలం 7.36 శాతం ఉన్నారు. కమీషన్ ఈ విషయాన్ని కూడా ఎత్తి చూపించింది. ముస్లిం రిజర్వేషన్ల గురించి మాటలయితే చాలా చెప్పారు, కాని చేతల్లో జరిగిందేమీ లేదన్న అసంతృప్తి ముస్లిముల్లో ఉంది.

ఈ విషయమై కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో వివరణ ఇచ్చారు. రిజర్వేషన్లు కల్పించాలనే తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపించిందని, కేంద్ర ప్రభుత్వం తొక్కి పెట్టిందని చెప్పారు. కాని 2019లో కూడా కేసీఆర్ మరోసారి తీర్మానం చేసి పంపిస్తామన్న మాటలే చెప్పారని, ముస్లిములకు రిజర్వేషన్ల విషయంలో బీఆరెస్ ఒక ఖచ్చితమైన చట్టబద్ధమైన వ్యూహం లేకుండా వ్యవహరిస్తుందా అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అసంతృప్తి ఉన్న ప్పటికీ, కేసీఆర్ పాలనలో ఎలాంటి మతపరమైన అల్లర్లు లేకుండా ప్రశాంతంగా ఉండడం కేసీఆర్‌కు ప్లస్ పాయింట్. ప్రవక్త ముహమ్మద్ (స)పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను తక్షణం అరెస్టు చేయడంలో ప్రభుత్వం తాత్సరం చేయలేదు. మత తత్వాన్ని ఏమాత్రం సహించేది లేదనే స్పష్టమైన సంకేతాలు బీఆరెస్ ఇవ్వడాన్ని చాలా మంది ప్రశంసించారు.

బీఆరెస్ పట్ల ముస్లిముల్లో ఉన్న కొద్దిపాటి అసంతృప్తిని రాజకీయంగా వాడుకునే ప్రయత్నాలు కాంగ్రెసు చేస్తూనే ఉంది. ముస్లిం డిక్లరేషన్ కోసం కాంగ్రెసు కసరత్తులు చేస్తోంది. ముస్లిం మేధావులు, నేతలు, సంస్థలతో మాట్లాడి వారి సలహా సూచనలు తీసుకుని ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వచ్చే ప్రయత్నాలు చేస్తోంది. కాని కాంగ్రెస్ హయాంలో అంటే 1983 నుంచి 1990 మధ్య కాలంలో హైదరా బాదులో జరిగిన అల్లర్లను చాలా మంది గుర్తు చేస్తున్నారు. బీఆరెస్ కాలంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ తలెత్తలేదు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చాలా సందర్భాల్లో కేసీఆర్ అను కూలంగా వ్యవహరించారు. బీజేపీ తీసుకున్న ముస్లిం వ్యతిరేక నిర్ణయాల విషయంలో కూడా కేసీఆర్ ఖండించడం వంటివి చేయ లేదు. ఈ ధోరణి కూడా ముస్లిముల్లో చాలా మందికి నచ్చలేదు. బీజేపీ వంటి మతతత్వ పార్టీని కేంద్రంలో నిరోధించాలంటే కాంగ్రెసును బలపరచాలన్న భావన కూడా బలంగా ఉంది. కాంగ్రెసు, బీఆరెస్ మధ్య ముస్లిం ఓట్లు చీలిపోతే బీజేపీ లాభపడు తుందన్న భయాలు కూడా మరోవైపు ఉన్నాయి. ముఖ్యంగా నిజామా బాద్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో బీజేపీ లాభపడవచ్చు.

మరికొందరి విశ్లేషణ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో, ఉన్నత మధ్య తరగతి ముస్లిములు కాంగ్రెసు వైపు మొగ్గు చూపినా గ్రామీణ ప్రాంతా ల్లోను, దిగువ తరగతి ముస్లిముల్లోను బీఆరెస్ పలుకుబడి ఏమాత్రం తగ్గలేదని మరికొందరు అంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ స్కీముల వల్ల లాభపడిన కుటుంబాలు బీఆరెస్ వెంటనే ఉన్నాయి.

కర్నాటక వంటి ఫలితాలు కాంగ్రెసు తెలంగాణలో సాధించాలని కోరడంలో అర్థం లేదు. ఎందుకంటే కర్నాటకలో ముస్లిములంతా పాలక బీజేపీని ఓడించాలని నిర్ణయించారు. ముస్లిమేతరుల్లోను చాలా పెద్ద సంఖ్యలో బీజేపీ వ్యతిరేకత ఉంది. పైగా కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచి వచ్చింది కాదు, పార్టీ మార్పిళ్ళ రాజకీ యాలు నడిపి ప్రభుత్వాన్ని కూల్చి గద్దెనెక్కారు. కర్నాటకలో ఎలాంటి ప్రాంతీయ పార్టీ రంగంలో లేదు. తెలంగాణ పరిస్థితి అది కాదు. ఇక్కడ పాలకపక్షం బీఆరెస్ పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉండవచ్చు, కాని ఆగ్రహం లేదు. ముస్లిముల్లోను అసంతృప్తి ఉంది కాని ఆగ్రహం లేదు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెసును బలపరచాలన్న భావన చాలా మందిలో ఉంది. కాని ఈ భావన ఓట్ల చీలికకు దారి తీయ వచ్చు. ఈ ఓట్ల చీలిక చివరికి బీజేపీకి లాభిస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు కొత్తగా ముందుకు వస్తోంది. ✤

అధ్యాయం 1

# నిర్ధారణాగ్రేసరుడు 2

# మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## 2. ధర్మ వికాసం

మహనీయ అబూ బక్ర్‌కు ఇస్లామ్ స్వీకరించిన వెంటనే తన ఇతర మిత్రులు గుర్తుకు వచ్చారు. వారికి ఇస్లామ్, నిజ ధర్మ సందేశాన్ని అందజేయడంలో జాగు చేయడం ఏ మాత్రం భావ్యం కాదని అనిపించింది ఆయనకు. ఆయన వెంటనే బయలుదేరి ఓ క్రమంలో వారి వద్దకు వెళ్ళి ఇస్లామ్ సందేశాన్ని అందజేశారు, అదే క్రమంలో ఆయన మిత్రులు కూడా ధర్మాన్ని స్వీకరించారు. వారు: మహనీయులు సఅద్ బిన్ అబీ వక్కాస్, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్, ఉబైద్ బిన్ జైద్, ఇంకా తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి యల్లాహు అన్హుమ్).

కొంతకాలం తరువాత ముస్లిముల సంఖ్య నలభై అయింది, తిరస్కారులు ఇస్లామ్ స్వీకరించే వారిని అతి ఘోరంగా హింసించే రోజులవి. అటువంటి పరిస్థితుల్లో నిరాటంకంగా ధర్మ ప్రచారం చేసే ప్రశ్నే తలెత్తదు. కాని మహనీయ అబూ బక్ర్ తన జాతి వారిని అజ్ఞానంలో మ్రగ్గుతూ ఉండటం చూసి సహించలేక పోయారు. తనకు ప్రాప్తమయిన కాంతిని, మక్కా వాసులయిన జాతి ప్రజలందరికీ సాధ్యమయినంత త్వరగా పంచి పెట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు.

కనుక ఆయన ఓ రోజు ప్రవక్త అనుమతి పొంది మక్కా వాసుల ఓ చిన్న సమావేశం నిర్వహించారు. ఇస్లామ్ శుభాలను వివరించ సాగారు. మక్కా వాసులు తాము తాత ముత్తాతల కాలం నుంచి మునిగి ఉన్న బహు దైవ భావన, విగ్రహారాధన తప్ప మరి దేన్ని గురించి కూడా వినడానికి సుముఖంగా లేరు. ఆయన మాటలు విని ఆగ్రహంతో ఉడికిపోయారు. అబూ బక్ర్ (ర) ని చంపి వేయాలని ఆయన పైకి ఎగబడ్డారు, బాగా కొట్టసాగారు. ఆ సమావేశంలో వచ్చిన అబూ బక్ర్ తెగవారు కొందరు ఆయన్ని రక్షించి ఇంటికి చేర్చి వెళ్ళిపోయారు.

## తల్లి స్వీకారం

ఇంటి వద్ద తల్లి ఆయన గాయాలు నిండిన శరీరం చూసి మమత కారణంగా, ఇక ముందు ఇలా చేయవద్దని కొడుకును సముదా యించడానికి ప్రయత్నం చేశారు. దానికి బదులుగా ఆయన ఇస్లామ్ సందేశాన్ని అందజేసి దాని శుభాలను తెలిపి, ఇస్లామ్ అనుసరించక పోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను గురించి కూడా ఆమెకు బోధపరిచారు.

ఆమెను ఉమ్ముల్ ఖైర్ (శుభాల పుట్టిల్లు) అని పిలిచేవారు జనులు. కొడుకు మాటలకు ఆమె బాగా ప్రభావితమయి

ముస్లిమ్ అవడానికి సిద్ధమయ్యారు. మరుసటి రోజు అబూ బక్ర్ ఆమెను వెంట బెట్టుకుని 'దార్ అర్కమ్' అనే నివాసానికి వెళ్ళారు. అది ఆనాటి ముస్లిముల కేంద్రం. అక్కడే ముస్లిములు ప్రతి రోజూ సమావేశమయి ఇస్లామీయ బోధనల తర్ఫీదు పొందేవారు. అక్కడ చేరగానే విచారించారు ప్రవక్త శ్రీ, ఆయన విన్నవించు కున్నారు, "అమ్మ, ఇస్లామ్ బోధనలు నేర్చుకుని ముస్లిమ్ అవడా నికి వచ్చారు, దైవ ప్రవక్తా! అమ్మకు సన్మార్గ బోధన చేయండి" అని. ప్రవక్త శ్రీ ప్రథమంగా ఆమెకు సలామ్ చేశారు, తరువాత సద్వచనం పఠింపజేశారు, దాని అర్థం వివరించారు. ఆమె ముస్లిమ్ అయ్యారు.

మహనీయ ఉమ్ముల్ ఖైర్ దీర్ఘాయుష్షు పొంది మదీనాకు హిజ్రత్ చేశారు, తన కుమారుని ఖిలాఫత్ కాలంలో పరమపదించారు.

## తండ్రి స్వీకారం

అబూ బక్ర్ తండ్రి, ఉస్మాన్... అబూ కహాఫా, మక్కా గౌరవనీయ పెద్దలలో ఒకరు. ఇస్లామ్ గురించి అప్పుడప్పుడు విన్నా ఏదో తాత్కాలిక విషయమని పట్టించుకోలేదు. కాని ప్రవక్త శ్రీ మదీనాకు హిజ్రత్ చేస్తున్న సందర్భంలో ఆయన్ని పట్టి తెచ్చిన వారి కొరకు మక్కా నాయకులు బహుమానం ప్రకటించినప్పుడు, అబూ కహాఫా తన ఇంటి ద్వారంవద్ద ఆతృతతో నిలిచి ఉండగా మహనీయ అలీ అటు నుంచి వెళ్ళడం తటస్థించింది. "ఇదో, ఇటువంటి వాళ్ళే మా అబ్బాయిని చెడగొట్టారు" అని కసురు కున్నారు.

ఈయన మక్కా విజయం సందర్భంలో గాని ఇస్లామ్ స్వీకరించేం దుకు సిద్ధం కాలేదు. అప్పుడు మహనీయ అబూ బక్ర్ ఈయన్ని ప్రవక్త సన్నిధిలో తెచ్చి ఇస్లామ్ బోధించ వలసిందిగా కోరారు. దానికి ప్రవక్త శ్రీ (స), "ఈయన గారికి ఈ అవస్థలో ఎందుకు కష్టం కలిగించావు, ముందుగా చెబితే నేను స్వయంగా ఈయన వద్దకు వెళ్ళే వాణ్ణి కదా" అన్నారు. అబూ కహాఫా దగ్గరకు రాగానే ఆయన(స) మర్యాదగా లేచి నిలబడ్డారు. ప్రక్కన కూచోబెట్టుకుని, ఆయన చేతుల్ని తన చేతులతో మృదువుగా పట్టుకుని కలిమా పఠింపజేసి ముస్లిమ్ చేశారు. అబూ కహాఫా మహనీయ ఉమర్ ఫారూక్ ఖిలాఫత్ హయాంలో పరమపదించారు.

## మహనీయ అబూ బక్ర్ కుటుంబం

ఈయనకు నలుగురు భార్యలు. ఇస్లామ్ స్వీకరించక మునుపే కతీలా అనే మహిళతో వివాహం జరిగింది. ఈమెకు ఇద్దరు సంతానం, కుమారుడు మహనీయ అబ్దుల్లా, కుమార్తె మహనీయ అస్మా. ఈ భార్యకు ఆయన ఇస్లామ్ స్వీకరించక మునుపే విడాకులు ఇచ్చి వేశారు.

రెండవ పెళ్ళి మహనీయ ఉమ్మురుమ్మాన్‌తో జరిగింది. ఈమె ఇస్లామ్ తొలి రోజుల్లోనే ముస్లిమ్ అయ్యారు,మదీనాకు హిజ్రత్ కూడా చేశారు. ఆమెకు మహనీయ అబ్దుర్రహ్మాన్, మహనీయ ఆయిషా జన్మించారు.

మూడవ పెళ్ళి మహనీయ అస్మా బిన్తు ఉమీస్‌తో జరిగింది. ఆమె పెళ్ళి తొలుత మహనీయ జాఫర్ బిన్ అబీ తాలిబ్‌తో జరగ్గా ఆమె ఆయనతోపాటే తొలుత అబీసీనియాకు, ఆ తరువాత మదీనాకు హిజ్రత్ చేశారు. మహనీయ జాఫర్ మౌతా సంగ్రామంలో అమర గతులవగా, ఇద్దత్ తరువాత ఆమెని అబూ బక్ర్ వివాహమాడారు. ఈమె ద్వారా అబూ బక్ర్‌కు ముహమ్మద్ అనే కుమారుడు కలిగాడు.

మహనీయ అబూ బక్ర్ ఆ తరువాత హబీబా బిన్తు ఖారిజని వివాహమాడారు. ఆయన పరమపదించిన తరువాత ఆమెకు ఆయన మూడవ కుమార్తె ఉమ్ము కుల్సూమ్ జన్మించారు.

ఈ విధంగా మహనీయ అబూ బక్ర్‌కు ముగ్గురు కుమారులు, మహనీయులు అబ్దుల్లా, అబ్దుర్రహ్మాన్, ముహమ్మద్(ర). కుమా ర్తెలు, మహనీయురాలు అస్మా, ఆయిషా, ఉమ్ము కుల్సూమ్(ర).

వీరిలో మహనీయ ఆయిషా దైవ ప్రవక్తకు అత్యంత ప్రియ మయిన సతీమణి. మహిళా సహచర మాన్యులలో ఇస్లామ్ పరిజ్ఞానం, పాండిత్యం, ఘనతల్లో అందరికన్నా ఆధిక్యత గలవారు.

## ఇస్లామ్ సర్వజనీనం

మహనీయ అబూ బక్ర్ ఇస్లామ్‌ని తన జీవన విధానం, పరమార్థ మార్గంగా గ్రహించగానే సమాజాన్ని ఆ సరళ మార్గంలోకి పరి వర్తింపజేయడం అవసరమని భావించారు. తొలుత తనకు సన్నిహిత వర్గం వరకు దాన్ని చేరవేయడం తన బాధ్యత అని గుర్తించారు. మక్కాపుణ్యపురిలోనూ సహజ ప్రకృతి గలవారని తనకు తెలిసిన వారందరికీ దైవ ధర్మాన్ని చేరవేశారు. యదార్థ విషయాలు, పరిశుద్ధ హృదయంతో, సత్య బద్ధమయిన నోటితో వెలువడిన వెంటనే విశుద్ధ మనస్కుల పైన ప్రభావం చూపు తాయి. నిర్ధారణాగ్రేసరుని ఈ కృషి ఫలితంగా మక్కాలోని పలు వురు పెద్దలు ఇస్లామ్ ధ్వజవాహకులయ్యారు. వారు, మహ నీయులు జుబైర్, అబ్దుర్రహ్మాన్, ఉస్మాన్ బిన్ మజ్ఊన్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్, ఖాలిద్ బిన్ సయీద్, అబూ సలమా ప్రభృతులు.

## పేదల పెన్నిధి

నిజ ధర్మం వైపునకు ఎప్పుడు పిలుపునివ్వడం జరిగినా దాన్ని వెంటనే తమ స్వంతం చేసుకున్న వారు నిరుపేదలు, అణగదొక్క

బడినవారే. వారిలోనే చిత్తశుద్ధి, సత్క్రియల పట్ల మక్కువ మెండుగా ఉంటాయి. వారే తాము నమ్మిన దాని కొరకు సర్వం త్యాగం చెయ్యడానికి సదా సన్నద్ధులయి ఉంటారు. ధన వంతులు, అధికారధనులు, సదా నమ్రూదులయి, ఫిర్ఔను లయి, కారూనులయి,ఈ సత్య వ్రతుల పైన హింసా దౌర్జన్యాల వర్షాలు కురిపించారు. అయినా సత్య ధ్వజవాహకులు బలహీనులయినా తాము నమ్మిన సత్య ధర్మాన్ని విడువ లేదు. సత్యధర్మం కడకు వారిని పైకి లేవనెత్తి ప్రపంచంలో అగ్రగణ్యు లయిన పాలకులుగా తీర్చిదిద్దింది!

ఈ ప్రపంచంలో సన్మార్గాన్ని సత్యధర్మాన్ని ప్రజలకు అందజేసి నప్పుడల్లా ధనం, అధికారం, పలుకుబడి గలవారు సదా దానిని తమ ఆధిక్యతకు, అధికారానికి అడ్డంకిగానే భావించారు. అందు వల్ల దాన్ని ఆదిలోనే వ్యతిరేకించేవారు. మహనీయ ముహమ్మద్ (స) విషయంలోనూ అదే జరిగింది. శ్రీమంతులు, పలుకుబడి గలవారు ఆయన్ని చంపివేయాలన్నంత వరకు పగబట్టారు.

ఒక రోజు ప్రవక్త శ్రీ కాబా పవిత్ర స్థలిలో నమాజ్ చేసుకుంటూ ఉండగా మక్కా నాయకుల్లో ఒకడయిన ఉకబా అటు రావడం తటస్థించింది. ఈ స్థితిలో ఆయన్ని చంపివేయాలనుకున్నాడు. తన ఒంటి పైని దుప్పటిని పెనవేసి ప్రవక్త శ్రీ(స) మెడలో వేశాడు, దాన్ని గట్టిగా ముడి వేసే ప్రయత్నం చేయసాగాడు. మహనీయ అబూ బక్ర్ ఆయన (స) కు సదా తోడునీడగా ఉంటూ ఇది గమనించి, పరుగున వచ్చి అతన్ని ప్రక్కకు త్రోసివేశారు, దుప్పటి అతని చేతుల్లో నుంచి లాక్కున్నారు. అలా చేస్తూ ఆయన ఆగ్ర హంతో, "ఏమిటీ, ఈ ఉత్తమ సజ్జనుణ్ణి కేవలం అతను ఒకే దైవాన్ని ఆరాధిస్తున్నందుకు, ఇతరులకూ దాన్ని బోధిస్తున్నందుకు చంపి వేస్తావా?" అని గద్దించారు.

ప్రవక్త శ్రీ (స) అందజేస్తున్న దైవ సందేశాన్ని స్వీకరించి అనుసరి స్తున్న వారు అత్యధికంగా నిరుపేదలు, పీడిత జనులు, బానిస ప్రజలే గనక వారిని శ్రీ మంతులు, అధికార మదాంధులు, వారి యజమానులు తమకు ఇష్టం వచ్చినట్లు హింసించేవారు. ముఖ్యంగా వారు బానిసల్నే అధికంగా పీడించ గలిగేవారు.

ఈ బానిస జనాన్ని గురించి బాగా బాధపడే వారు అబూ బక్ర్. ఇటువంటి నిస్సహాయులు, నిరాశ్రయులయిన వారిని బానిసత్వ బంధనాల నుండి విడుదల చేయించేందుకు ఆయన వారిని వారి యజమానుల నుండి కొని స్వేచ్ఛ కల్పించేవారు.

ఒకసారి అబూ బక్ర్ ఎటో వెళ్తుండగా ఓ మక్కా నాయకుడు ఉమయ్యా కంఠం వినిపించింది, అతను ఆగ్రహంతో అరుస్తూ తన అబీసీనీయుడయిన బానిస బిలాల్‌ను చితక బాదుతున్నాడు. ఆయన పరుగు పరుగున అక్కడికి పోయి చూశారు, అతను బిలాల్‌ని ఎండలో మండుతున్న ఇసుకపైన పడవేసి ఆయన రొమ్ము మీద ఓ పెద్దబండరాయి ఉంచాడు, బిలాల్‌ని ఉమయ్యా అడుగుతున్నాడు,

"ధర్మభ్రష్టుడివి నువ్వు, బుద్ధిలేని బిలాల్! ఇక చెప్పు, దేవుడు ఒక్కడేనా?"అని. అంతటి బాధలోనూ మహనీయ బిలాల్ సమా ధానం, ఒక్కడే, ఒక్కడే ఒక్కడు. సకల లోక ప్రభువు ఒక్కడే" అన్నది.

అబూ బక్ర్‌కు కన్నీరు ఆగలేదు, మనసు తహతహలాడింది, వెంటనే ఉమయ్యాని సంబోధించి,

"బిలాల్ నీకు నచ్చకపోతే నాకు అప్పజెప్పు, చెప్పు, ఎంత తీసుకుంటావు?"అని అడిగారు. అతను చెప్పిన వెల చెల్లించి మహనీయ బిలాల్‌ని బానిసత్వం నుంచి విడుదల చేసి స్వేచ్ఛ కల్పించారు. ఇలా అనేకమంది బానిసల్నీ అనాథల్నీ ఆదుకున్నా రాయన. వారిలో ఆమిర్ బిన్ ఫుహైరా, నజీరా బిన్తు నహ్దియ, జారియ, జన్నీరా, ముఅమ్మిల్ తదితరులు అనేకమంది అలా స్వేచ్ఛ పొందిన వారే. ఆయన బట్టల వ్యాపారం చేసేవారు. ఒక ఉల్లేఖనం ప్రకారం, ఆయన వద్ద వ్యాపారంలో గడించిన నలభై వేల దిర్హములు నగదు ఉండేది. అదంతా ఆయన నిరుపేదలు, బలహీనులు, బానిసలను సముద్ధరించడానికి ఖర్చు చేసివేశారు.

ఆయన తండ్రి అబూ కహాఫాకు, తనయుని ఈ వైఖరి నచ్చలేదు. ఆయన పిలిచి ఇలా బోధించారు, "నాయనా, నీవు నీ ధనమంతా ఇలా వృద్ధులూ బలహీనుల కొరకు ఖర్చు పెట్టి ప్రయోజనం ఏమిటీ, యువకుల పైన ఖర్చు పెట్టినా రేపు నీకూ నీ సంతానా నికీ అవసరం ఏర్పడితే వారు ఉపయోగపడతారు." అంతా విని ఆయన ఇలా సమాధానం ఇచ్చారు. "నాన్నా, నేను ఇదంతా దేవుని ప్రసన్నత పొందడానికి చేస్తున్నాను. ఆ ప్రభువు ప్రసన్నుడయితే నాకు అదే చాలు." ✤

వ్యక్తి సంస్కార,
సంఘ నిర్మాణ,
నైతిక పథకం


గీటురాయి
వారపత్రిక

# పోరు పాట!



- కవి కరిముల్లా

అరెరె...
పశ్చిమాసియా పుండై రగిలిన
పాలస్తీనా పిడికిలి చూడు
దుష్ట ఇజ్రాయిల్పై ఎగిసిన
పిల్లాడి రాయిని చూడు
అది రాయి కాదు
దశాబ్దాల పీడితుల
కన్నీటి చుక్క
అంతం కాని దాస్యం ఓడ్చిన
నెత్తుటి ఉల్క
ఆయుధం అహంకరిస్తే
ఆత్మత్యాగమై నిలుస్తుంది.
ఉక్కు చట్రం విసిరితే
ఉరుముల జలపాతమౌతుంది
ఒప్పందం వంచనై తేలితే
తళుకులీనే ప్రశ్నవుతుంది.
దానికీ కళ్లు న్నాయి
మృతసముద్రమంత కన్నీళ్లున్నాయి
నాడీ తంత్రులున్నాయి
దగ్ధగీతాన్ని ఆలపించే
కోట్లాది స్వరచిందువలున్నాయి
ఇప్పుడదే....
అల్లాహొ అక్బర్ నినాదమౌతుంది.
వెన్నెల పాట పూయాల్సిన ఎదల్లో
మండే అగ్నికీలౌతుంది
హద్దులు గీసిన గోడలపై
విధ్వంస నినాదమౌతుంది.
రక్తం కక్కుతున్న గాజా
వధ్యశిలపై వేలాడుతున్న
ఊపిరిలా ఉంది.
జియోనిస్టు కండకావరానికి బలైన
పసిపిల్ల మానంలా ఉంది.
శోకగీతాలు పాడుకుంటున్న
ఆత్మల సమాహారంలా ఉంది
నయవంచకుల దొంగ దెబ్బకు
సజ్దాలో షహీద్ ఐన
ఇమామ్ హుస్సైన్ (ర)కాయంలా ఉంది.
జాగృతినిచ్చే ఆ అజాన్ పిలుపు
సామ్రాజ్యవాది అంతానికి మోగిస్తున్న
గంట ధ్వనిలా ఉంది.
పాలస్తీనా యోధుడా..!
నీ దేహం నిర్జీవమై అనాధలా
పడి ఉండొచ్చు
నీ రక్తం పాయలై
నయగరా జలపాతంలా పారవచ్చు
కానీ...
కోట్లాది చేతులు నీ విముక్తికై
ఆర్తితో దుఆ చేస్తున్నాయి.
షైతాన్ కళ్లల్లోకి సూటిగా చూసిన మొనగాడా
నువ్వు దిక్కులేని శవానివి కావు.
మౌనంగా కదిలే,నడిచే
శవాలే దిక్కులేనివి.
అణ్వస్త్రాలు శాసిస్తాయని
హూంకరిస్తున్న జియోనిజం
అట్టడుగు పొరల్లోకి తొక్కబడ్డ విత్తనం
రాతి పొత్తిళ్లనైనా చీల్చి ఎగుస్తుందని
భావి చరిత్రలో తెల్చుకోనుంది.



# యువతరం చైతన్య దీప్తి అబ్దుల్ కలామ్

- యండి. ఉస్మాన్ ఖాన్

**ప్రతిరోజూ** భూమ్మీద ఎంతోమంది పుడుతూ ఉంటారు. మరణిస్తూ ఉంటారు. కాని కొంతమందే మరణం తరువాత కూడా గుర్తుండి పోతారు. అలాంటి అతికొద్ది మందిలో మొదటివారు ఏపీజే అబ్దుల్ కలామ్. కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి.. అంటూ యువతరాన్ని తట్టి లేపి, కర్తవ్యబోధ చేసిన కలామ్‌కు ఆయన పుట్టినరోజు సందర్భంగా సలామ్ చేద్దాం. కలలు కనడమంటే, ఊహల్లో విహరించడం, గాలి మేడలు కట్టడం కాదు. పగటి కలలు కనడం అంతకన్నా కాదు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించడం.. సాధించడంకోసం శ్రమించడం. శ్రమించి సాధించడం. ప్రతి ఒక్కరూ కలలు కనాలి. నేను ఫలానా కావాలి.. నేను అది సాధించాలి.. నేను అది చేయాలి.. అనే కలలు కనాలి. దాన్ని సాధించడం కోసం ఏంచెయ్యాలో అది చెయ్యాలి. ఎంత శ్రమించాలో అంత శ్రమించాలి. లక్ష్యాన్ని సాధించాలి. చిన్న లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం పెద్ద నేరంతో సమానమని చెప్పిన ఏపీజే అబ్దుల్ కలాం జీవితం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఆయన జీవితం నుండి స్ఫూర్తిని, ప్రేరణను పొందాలి. భారత దేశానికి 11వ రాష్ట్రపతిగా ఎనలేని సేవలందించిన కలామ్ పూర్తి పేరు, అవుల్ ఫకీర్ జైనుల్ ఆబిదీన్ అబ్దుల్ కలాం. 1931 అక్టోబరు 15న తమిళనాడులోని రామేశ్వరం అనే గ్రామంలో సామాన్య ముస్లిం కుటుంబంలో జన్మించారు. తల్లి దండ్రులు జైనుల్ ఆబిదీన్, ఆసియామా. పేద కుటుంబం కావటంతో తల్లిదండ్రులకు ఆర్థిక పరంగా చేదోడు వాదోడుగా ఉండడం కోసం పేపర్ బాయ్‌గా పని చేశారు. సైకిల్ పై ఇంటింటికీ తిరిగి వార్తా పత్రికలు పంపిణీ చేసేవారు. తెల్లవారు ఝామునే అమ్మ నిద్రలేపి, స్నానం చేయించి, ట్యూషన్‌కు పంపేది. ట్యూషన్ ముగించుకొని రాగానే నాన్న నమాజుకు తీసుకువెళ్ళేవాడట. నమాజు తరువాత రైల్వే స్టేషనుకు వెళ్ళి దినపత్రికల పార్సిళ్ళు తెచ్చి పంపిణీ చేసేవారు. అంతచిన్న వయసులోనే అంతగా కష్టపడి పనిచేస్తూనే చదువుకున్నారు కలామ్. ప్రాధమిక విద్య అనంతరం, రామనాథపురం స్కార్జ్ హైస్కూల్‌లో మెట్రిక్ ముగించుకొని, తిరుచిరాపల్లిలోని సెయింట్ జోసెఫ్ కళాశాల నుండి భౌతిక శాస్త్రంలో, చెన్నైలోని మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పట్టాలు సాధించారు.

తరువాత ఇస్రోలో చేరి మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (SLV-III) తయారీలో పాలుపంచుకున్నారు. 1980 జూలైలో ఈ వాహనం రోహిణి ఉపగ్రహాన్ని భూమి సమీప కక్ష్యలోకి విజయవంతంగా చేర్చిన విజయం తరువాత తనను కలవాల్సిందిగా ఇందిరాగాంధీ నుండి సతీశ్ ధావన్‌తో పాటు, కలామ్‌కూ ఆహ్వానం అందింది. అయితే మొదట ఈ ఆహ్వానం వచ్చినప్పుడు కలామ్ కాస్త భయపడ్డారు. 'తనకు మంచి షూస్

కూడా లేవు, కేవలం చెప్పులు మాత్రమే ఉన్నాయి. ఎలా రావాలి..?' అని సతీశ్ ధావన్ వద్ద మొహమాటపడ్డప్పుడు, ఆయన 'మీరు ఇప్పటికే విజయం అనే సూట్ ధరించి ఉన్నారు, ఎటువంటి సందేహాలు పెట్టుకోకుండా వచ్చేయండి' అన్నారాయన. 1970, 1990 మధ్య కాలంలో, కలామ్ పిఎస్ఎల్వి, ఎస్ఎల్వి-3 ప్రాజెక్టుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఇవి రెండూ విజయవంతం అయ్యాయి. 1970లలో ఎస్ఎల్వి రాకెట్ ప్రయోగించి రోహిణి-1 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపడం ఇస్రో చరిత్రలో మైలురాయి. ఇందులో పని చేయడం తన జీవితంలోని అతి పెద్ద విజయాల్లో ఒకటని ఎంతో వినమ్రంగా చెప్తారు కలామ్. 1992 జూలై నుండి 1999 డిసెంబరు వరకు ప్రధానమంత్రి శాస్త్రీయ సలహాదారుగా, డిఆర్డిఓ ముఖ్య కార్యదర్శిగా కలామ్ పనిచేసారు. అదే సమయంలో జరిపిన పోఖ్రాన్ అణు పరీక్షల్లో కలామ్ సంస్థాగత, సాంకేతిక, రాజకీయ పాత్ర పోషించి, భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చారు. అందుకే కలామ్ అణు శాస్త్ర పితామహుడిగా, మిసైల్ మ్యాన్‌గా కీర్తించబడ్డారు. 1998 లో హృద్రోగ వైద్య నిపుణుడైన డాక్టర్ సోమరాజుతో కలిసి సంయుక్తంగా ఒక స్టెంటును (stent) అభివృద్ధి చేసారు. దీన్ని 'కలామ్- రాజు స్టెంట్' అని అంటారు. 2012లో, వీరిద్దరూ కలిసి, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించడంలో సహాయంగా ఉండేందుకు ప్రత్యేకంగా ఒక ట్యాబ్లెట్ (Tablet) కంప్యూటరును తయారు చేసారు. దీన్ని 'కలామ్ - రాజు ట్యాబ్లెట్' అని పిలుస్తారు. 2002 నుండి 2007 వరకు కలామ్ భారత రాష్ట్రపతిగా సేవలందించారు. ఇసుమంతైనా భేషజం లేని కలామ్ ఎప్పుడూ ప్రజల మనిషిగా మెలిగారు. ప్రజలు కూడా ఆయన్ని ఆవిధంగానే ఆదరించి, అభిమానించారు. కలామ్ 40 విశ్వ విద్యాలయాల నుండి అనేక గౌరవ డాక్టరేట్లను అందుకున్నారు. ఇస్రో, డిఆర్డీఓలలో పని చేసినందుకు, ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా విశిష్ట సేవలందించినందుకు భారత ప్రభుత్వం 1981లో పద్మ భూషణ్, 1990లో పద్మ విభూషణ్‌లతో సత్కరించింది. భారతదేశంలో రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధన, ఆధునీకరణలకు చేసిన కృషికి 1997లో భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ఆయన్ని వరించింది. 2013లో అంతరిక్ష సంబంధిత పథకానికి నాయకత్వం వహించి విజయవంతంగా నిర్వహించినందుకు అమెరికాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ నుండి ప్రతిష్టాత్మక వాన్ బ్రాన్ అవార్డును అందుకున్నారు. 2015 జూలై 27న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIM) షిల్లాంగ్‌లో విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దాంతో వేదికపైనే కుప్పకూలిపోయారు కలామ్. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. అప్పుడు ఆయన వయసు 83 సంవత్సరాలు. అక్కడినుండి స్వస్థలమైన రామేశ్వరం తరలించి, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో ఖనన సంస్కారాలు నిర్వహించారు. అత్యున్నమైన రాష్ట్రపతి పదవిని చేపట్టినా అతి సామాన్యుడిలా జీవితం గడిపిన కలామ్ అందరికీ ఆదర్శప్రాయుడంటే అతిశయోక్తిలేదు. ఈ కాలంలో కూడా ఇలాంటి వాళ్ళు ఉండడం చాలా అరుదు. మనం మన జీవితంలో మరో కలామ్‌ను చూడలేకపోవచ్చు. ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన పిఎం నాయర్ దూరదర్శన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన ఆసక్తికర విషయాలను ఈ సందర్భంగా మననం చేసుకోవడం చాలా అవసరం. రాష్ట్రపతి హోదాలో వివిధ దేశాల్లో పర్యటించినపుడు కలామ్‌కు ఆయా దేశాధినేతలు ఇచ్చిన బహుమతులను తిరస్కరిస్తే వారిని అవమానించినట్లవుతుందని, అది భారత్‌కు కూడా ఇబ్బంది కరమేనని భావించి వాటిని స్వీకరించేవారు. భారత్‌కు తిరిగి రాగానే వాటిని ఫోటోలు తీసి, కేటలాగు తయారు చేయించి ఆర్కైవ్స్‌లో భద్రపరిచేవారు. పదవీ కాలం పూర్తయిన తర్వాత అందులోంచి ఒక్క పెన్సిల్ ముక్కను కూడా ఆయన తీసుకోలేదు.

2002లో రమజాన్ సందర్భంగా రాష్ట్రపతి ఇచ్చే ఇఫ్తార్ విందుకు ఎంత ఖర్చు అవుతుంది అని కలామ్ అడిగారు. దాదాపు 22 లక్షలు ఖర్చు అవుతుందని నాయర్ చెప్పారు. శ్రీమంతులకు విందు ఇవ్వడం కోసం అంత ఖర్చు పెట్టడం అవసరమా... ఆ సొమ్మును నిరుపేదలకు బ్లాంకెట్లు, బట్టలు, ఆహారం కోసం కేటాయించి, అనాథాశ్రమాలకు ఇవ్వమని చెప్పారు. అంతేకాదు అనాథాశ్రమాలను ఎంపిక చేసే పని కొంతమందికి అప్పగించారు.


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఆయన ఏమాత్రం జోక్యం చేసుకోలేదు. ఎంపిక తర్వాత నాయర్‌ను గదిలోకి పిలిచి తన వ్యక్తిగత సంపాదనలో లక్ష రూపాయలు ఇచ్చి, దీని గురించి ఎవరికీ చెప్పకండి అన్నారు. ఈ విషయం అందరికీ తెలియాలి సార్, చెబుతాను అని నాయర్ అంటే, వద్దని వారించారు. దటీజ్ కలామ్. ఒకసారి కలాం తన బంధువులు 52 మందిని రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించారు. వారందరికీ ఢిల్లీ చూపించడానికి బస్సు బుక్ చేసి, ఆ ఖర్చు తన వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించారు. ఒక్క అధికారిక వాహనం కూడా వారికి కేటాయించలేదు. వారి కోసం అయిన షుమారు రూ. 2 లక్షలను తనే చెల్లించారు. దేశ చరిత్రలో ఇలాంటి సంఘటన ఇంతకు మునుపు ఎప్పుడూ జరగలేదు. కలామ్ తన సోదరుడిని ఒక వారం రోజులు రాష్ట్రపతి భవన్‌లో ఉంచు కున్నందుకు ఆయన అద్దె చెల్లిస్తానన్నారు. దీనికి మాత్రం ఎవ్వరూ ఒప్పుకోలేదు. దేశానికి అధ్యక్షుడు తన నివాసంలో సొంత అన్నను వారం రోజులు ఉంచుకున్నందుకు అద్దె చెల్లిస్తాననడం తాము భరించలేకపోయామని, ఇంతటి నిజాయితీని తాను జీవితంలో చూడలేదని, చూడబోమని నాయర్ చెప్పారు. కలామ్ రాష్ట్రపతి భవన్ ఖాళీచేసి వెళ్లే ముందు ఉద్యోగులందరూ కుటుంబాలతో వెళ్ళి కలిస్తే, పేరు పేరునా పలకరించారు. అయితే నాయర్ భార్య ఆనారోగ్యంతో రాలేకపోయింది. మీ ఆవిడ ఎందుకు రాలేదని అడిగారు, నేను కారణం చెప్పాను. మర్నాడు మా ఇంటి ముందు పోలీసుల హడావుడి.. ఏమిటా అని ఆరాతీస్తే, రాష్ట్రపతి మా ఇంటికి వస్తున్నారని తెలిసింది. ఇంతవరకూ ప్రపంచంలో ఏ దేశాధినేత తన దగ్గర పనిచేసే ఒక ఉద్యోగి భార్య అనారోగ్యంతో ఉందని తెలిసి ఇంటికి వెళ్లి పరామర్శించినట్టు చరిత్రలో ఎక్కడా జరగలేదని నాయర్ గద్గద స్వరంతో ఆ మధురానుభూతిని పంచుకున్నారు. మన కాలంలో మన మధ్య నడయాడిన ఆ మహా మనిషి ఆస్తి మూడు ప్యాంట్లు, ఆరు షర్టులు, మూడు సూట్లు, ఒక వీణ, ఒక చేతి గడియారం, 2,500 పుస్తకాలు, ఒక పద్మభూషణ్, ఒక పద్మ విభూషణ్, ఒక భారతరత్న, 16 డాక్టరేట్లు, ఇంచుమించు సున్నా బ్యాంకు బ్యాలెన్సు,135 కోట్ల మంది భారతీయుల ప్రేమాభిమానాలు.. ఇదీ కలామ్ యావదాస్తి. సర్వమత గ్రంధాలను అధ్యయనం చేసి, ఆకళింపు చేసుకున్న కలామ్ అన్ని మతాలనూ సమానంగా గౌరవించేవారు. శాంతి కాముకుడు, సిసలైన మానవతా వాది. అందరికీ ఆదర్శప్రాయుడు. ముఖ్యంగా విద్యార్థులు, యువత కోసం పరితపించిన కలామ్ సదా స్మరణీయుడు. అందుకే కలామ్ సాబ్‌కు కనీసం ఒక్కసారి సలామ్ చేద్దాం. ❖

## ధైర్యసాహసాలతో సత్యశోధన ఫలితం - ముహమ్మద్ జుబేర్ కు 2023 ఫ్రీడం ఆఫ్ ఎక్స్ ప్రెషన్ అవార్డు



ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు ముహమ్మద్ జుబైర్ 2023 ఫ్రీడం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అవార్డుకు జర్నలిస్టుల కేటగిరిలో నామినేట్ అయ్యాడు. ఈ ప్రకటన అక్టోబర్ 4వ తేదీన వచ్చింది. స్వచ్ఛంద సంస్థ ది ఇండెక్స్ ఆన్ సెన్సార్ షిప్ ఈ ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా భావప్రకటనాస్వేచ్ఛ కోసం ఈ సంస్థ పనిచేస్తుంది. ముగ్గురు నామినీల్లో జుబైర్ ఒకరు. భారత మీడియాలో లోపాలను చక్కదిద్దడానికి జుబైర్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ నామినేషన్ లభించింది. మీడియాపై రాజకీయ ఒత్తిళ్ళు, ప్రభుత్వ నిధులు పొందడంలో వివక్షలు మొదలైన అనేక లోపాలపై ఆయన పనిచేశారు. ముఖ్యంగా ప్రాపగాండను నిర్మూలించడానికి, ప్రాపగాండ నెట్వర్క్‌లను కూల్చడానికి ఆయన పనిచేశారు. రాజకీయమైన నిజనిర్ధారణలు చేపట్టి అనేక వార్తల్లోని నిజానిజాలు వెలికితీశాడు. సోషల్ మీడియాలో పుకార్లను, మీడియాలో అబద్ధాలను, మీడియా పక్షపాతాలను ఆయన పటాపంచలు చేసాడు. జూన్ 2022లో ఆయన అరెస్టయిన సంఘటనను కూడా ది ఇండెక్స్ ఆఫ్ సెన్సార్‌షిప్ ప్రస్తావించింది. పాలకపక్షానికి చెందిన పలుకుబడి కలిగిన వ్యక్తులు ప్రచారంలో పెడుతున్న అబద్ధాలను బట్టబయలు చేసినందుకు ఆయన ఎదుర్కొన్న ప్రమాదకర పరిస్థితులను ఈ సంస్థ గుర్తించింది. ప్రతికూల పరిస్థితుల్లోను ఆయన చూపించిన ధైర్యాన్ని ప్రశంసించింది. ఆయన జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడింది. ఈ అవార్డుకు నామినేట్ అయిన మరో సంస్థ బిలాన్ మీడియా. సోమాలియాకు చెందిన కేవలం మహిళలు మాత్రమే నడిపే మీడియా సంస్థ ఇది. నామినేట్ అయిన మరో జర్నలిస్టు ముర్తజా బహ్బూదీ. అఫ్గనిస్తాన్‌కు చెందిన ఈ జర్నలిస్టును తాలిబాన్లు ఈ సంవత్సరం జనవరిలో అరెస్టు చేశారు. గతంలో ఈ అవార్డును చైనాకు చెందిన హువాంగ్ క్సెనిన్ 2022లో పొందారు. నిగర్ జర్నలిస్టు సమీరా సబూ 2021లో పొందారు.

# పతనమైన భావప్రకటనా స్వేచ్ఛ




భారతదేశంలో పత్రికాస్వేచ్ఛ పరిస్థితి ఎంతగా పతనమయ్యిందో చెప్పే వార్త ఇది. రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ 2023 సంవత్సరం పత్రికాస్వేచ్ఛ సూచికను తయారు చేసింది. మొత్తం 180 దేశాల జాబితాలో భారతదేశం ఇప్పుడు 161వ స్థానంలో ఉంది. పత్రికల పట్ల భారత ప్రభుత్వ వైఖరిని ఈ నివేదిక తీవ్రంగా విమర్శించింది. ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీని విమర్శించే, బీజేపీని విమర్శించే పత్రికల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసించింది. భారతదేశానికి సంబంధించి సెక్యూరిటీ ఇండికేటర్ తరగతిలో 172వ స్థానంలో ఉండడం మరింత విచారకరమైన విషయం. అంటే జర్నలిస్టుల భద్రత విషయంలో ప్రపంచంలో మనకన్నా దిగువస్థాయిలో కేవలం ఎనిమిది దేశాలు మాత్రమే ఉన్నాయి. అంటే అఫ్ఘనిస్తాన్ కూడా మనకన్నా మెరుగ్గా, 152వ స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ ఎలాంటి దయనీయ స్థితిలో ఉందో దీన్ని బట్టి తెలుస్తోంది. రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ నివేదిక ప్రకారం జర్నలిస్టులపై హింసాకాండ, రాజకీయ పక్షపాతంతో కూడుకున్న మీడియా, మీడియా యాజమాన్యం టైమ్స్ నౌ, హెచ్ టీ మీడియా, ది హిందూ గ్రూప్, నెట్వర్క్ 18 వంటి కొందరి చేతుల్లో మాత్రమే ఉండడం, ప్రభుత్వానికి, మీడియా యాజమాన్యాలకు మధ్య పరస్పర లాభాల మిలాకతు చర్యలు, మోడీకి వ్యక్తిగత మిత్రుడైన ముఖేశ్ అంబానీకి దాదాపు 70 మీడియా సంస్థల యాజమాన్యం ఉండడం, ఈ మీడియా సంస్థలకు దాదాపు 80 కోట్ల భారతీయులు ప్రేక్షకులుగా ఉండడం వంటి అనేక విషయాలను ప్రస్తావించింది. జర్నలిస్టులను వేధించడానికి కేసులు పెట్టడం కూడా జరుగుతుంది. దేశద్రోహం, క్రిమినల్ పరువునష్టం, జాతీయభద్రతను ప్రమాదంలో నెట్టడం వంటి ఆరోపణలతో ప్రభుత్వాలు జర్నలిస్టులపై కేసులు పెడుతున్నాయి. ఈ విషయమై ఏమైందంటే, సైద్ధాంతికంగా భారతచట్టాలు రక్షణ కల్పించేవని చెప్పుకున్నప్పటికీ ఆచరణలో ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టులపై కేసులు పెడుతూనే ఉన్నారు. జాతివ్యతిరేక శక్తులుగా ముద్రలు వేస్తున్నారు అని ఈ నివేదిక పేర్కొంది. దక్షిణాసియాలో చూసినా, బంగ్లాదేశ్ ఒక్కటే మనకన్నా 163వ స్థానంలో వెనుకబడి ఉంది. పాకిస్తాన్ కూడా 150వ స్థానంలో మెరుగ్గానే ఉంది. తాలిబాన్ల పాలనలో ఉన్న అఫ్ఘనిస్తాన్ కూడా మనకన్నా మెరుగ్గా 152వ స్థానంలో ఉండడం ఆశ్చర్యం. భారత మీడియా సంస్థల్లో చాలా వరకు అగ్రవర్ణాలకు చెందిన వారే సీనియర్ స్థానాల్లో ఉన్నారని ఈ పక్షపాతం మీడియా కంటెంటులో కూడా కనిపిస్తుందని నివేదిక పేర్కొంది. మహిళా జర్నలిస్టులు ఆన్ లైనులో ఎదుర్కునే వేధింపులను కూడా పేర్కొంది. పత్రికాస్వేచ్ఛ విషయంలో అంతర్జాతీయ సూచికల్లో మన స్థానం దిగజారడమంటే ప్రజల ప్రాథమిక హక్కులకు కూడా విఘాతమని అర్థం చేసుకోవాలి.

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# దిగజారిపోతున్న నైతిక విలువలు

షహనాజ్ బేగం, అనంతపురం



ఆ విషయం తెలుసుకున్నప్పట్నుంచి నా మనస్సు భగ్గుమంటున్నది. నాలో ఆశ్చర్యం, ఆగ్రహం, ఆవేదనలు ముప్పిరిగొల్పుతున్నాయి.

ఛీఛీ.. మరీ ఇంత విశృంఖలత్వమా? ఇంత బరితెగింపా. సిగ్గు, లజ్జా, నీతి నియమాలను గాలికొదిలేసి నైతిక విలువలను దిగజార్చి ఇంత బహిరంగంగా బరితెగించడమా? వీరిని అడ్డుకునే వారు ఎవరూ లేరా? మన సమాజం ఎటు పోతోంది??

హైదరాబాద్ నగరంలో నివాసముంటున్న మేము మా సౌకర్యార్థం మరో అపార్ట్‌మెంట్‌కి మారవలసి వచ్చింది. అది మంచి నివాస యోగ్యమైన ప్రదేశమని భావించాము. ఎందుకంటే అపార్ట్ మెంట్‌కు సమీపంలోనే కూరగాయల మార్కెట్, షాపింగ్ మాల్, నిత్యావసర వస్తువుల షాపులు, అన్నిటికంటే ముఖ్యంగా ఓ పేరున్న దవాఖానా కూడా ఉంది. మంచి ప్రాంతంలో ఇల్లు దొరికిందని సంతోషించాము. ఇల్లు కూడా సకల సౌకర్యవంతంగా ఉంది. కానీ ఆ ఆనందం కొద్దిరోజుల్లోనే హరించుకుపోయింది.

మా అపార్ట్‌మెంట్ ఒక చిన్న సందులో ఉంది. ఆ సందులో మా అపార్ట్‌మెంట్ ఎదురుగా ఓ చిన్న హొటల్/ లాడ్జి ఉంది. అక్కడ భోజనం లేదా తిండి పదార్థాలు వంటి వసతుల్లేవు. అక్కడ అనైతిక చర్యలు జరుగుతున్నాయి.

బాహాటంగా జరుగుతున్న ఈ లజ్జాకరమైన వ్యాపారం గురించి తెలుసుకుని సిగ్గుతో నా తల తిరిగిపోయింది.

వీరిని ఎవరూ అడ్డుకోలేరా?? ఇది నవ నాగరికత కలిగిన పాశ్చాత్య దేశమా? లేదా సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన మన భారతదేశమా?? ప్రస్తుతం మన సమాజం ఎదుర్కొంటున్న రుగ్మతల్లో ఇలాంటి అనైక చర్యలు ఒకటి.

అక్కడ నివసించడం తగదని, విచ్చలవిడితనం పేట్రేగిపోతున్న ఆ ప్రదేశంలో ఎదుగుతున్న మా పిల్లల క్షేమం దృష్ట్యా మరో ఇంటి కోసం అన్వేషణ ప్రారంభమైంది.

మేము ఇంటికోసం వెతుకుతున్న సమయంలో మరో కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. చదువుకోసమని నగరానికి వచ్చిన కొంతమంది మగ పిల్లలు, ఆడపిల్లలు కలిసి ఒకే ఇంట్లో బస చెయ్యడం. అంటే ఒకేచోట వండుకోవడం, తినడం, పడుకోవడం అన్నమాట. ఇలాంటి వాటిని అసలు వారి తల్లిదండ్రులు ఎలా అనుమతిస్తున్నారు. పరస్పరం ఒకరినొకరు ఆకర్షణకు లోనయి చెడు మార్గాలు పట్టవచ్చు.

ఈ సంస్కృతి అమెరికా వంటి పాశ్చాత్యదేశాలలో కొనసాగుతున్నది. సర్వీస్ అపార్ట్‌మెంట్‌లు వంటివి ఉన్నాయి. కానీ ఆ విష సంస్కృతి ఇక్కడ కూడా దాపురించడం వింతను గొల్పింది.

అలా యువతీ యువకులు రాత్రింబవళ్ళు కలిసిమెలిసి గడపడం సమంజసమా? ఈ సమాజం ఆరోగ్యకరంగానూ విజయవంతంగానూ ముందుకు సాగాలంటే కొన్ని విలువలను ముఖ్యంగా నైతిక విలువలను పాటించాలి.

అందుకే మహాప్రవక్త(స) మానవీయ విలువలు, నైతిక విలువలకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చారు. ఎక్కడ అనైతికం ప్రబలుతుందో అక్కడ అశాంతి, అసహనం చోటు చేసుకుంటాయి.

ఈ విశృంఖలతను అరికట్టలేకపోతే రాబోయే కాలంలో మరింత విజృంభించవచ్చు. నైతిక విలువలు మరింత దిగజారిపోతే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. నేరాలు పెరిగిపోతాయి. సమాజంలో అశాంతి, దుర్మార్గపు చర్యలు, అధర్మం చోటు చేసుకుంటాయి. భవిష్యత్తులో మన పిల్లలు లేదా నవతరం దీని బారిన పడకుండా మంచి సమాజాన్ని నిర్మించాలి. ధార్మిక విద్య వైపు మళ్ళించాలి. పెంపకం బాగుండాలి. పాపపుణ్యాల విచక్షణను నేర్పించాలి.

# తియ్యని మాటలు- స్వర్గానికి బాటలు

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంటారు. అతడు ఎలాంటి వాడో తెలుసుకోవడానికి ఒక్కమాట చాలు. మనిషి తన నోటితో ప్రతిరోజు ఎన్నో పుణ్యకార్యాలు చేస్తూ ఉంటాడు. అలాగే పాపాలు కూడా చేస్తూపోతాడు. నోరు మంచిదైతే అతనికి సమాజంలో, కుటుంబంలో, స్నేహితులలో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెడుతుంది. ఆ నోరే అదుపు తప్పితే ఇహపరాల్లో ఎన్నో ఆపదలు, కష్టాలు తెచ్చిపెడుతుంది.

మనిషి మాట్లాడే ప్రతి మాట, ప్రతి వాక్యం, ప్రతి అక్షరం వ్రాయబడుతుంది. ప్రతి అక్షరం ఏమాత్రం తప్పులు లేకుండా (పొల్లు పోకుండా) భద్రపరచబడి ఉంది.

అంతిమ దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా తెలుపుతు న్నాడు: (మనిషి) నోట ఒక మాట వెలువడటమే ఆలస్యం, అతని దగ్గర ఒక పర్యవేక్షకుడు (దాన్ని నమోదు చేయడానికి) సిద్ధంగా ఉంటాడు. (50: 18)

మనిషి కొన్ని సార్లు తెలిసి, కొన్నిసార్లు తెలియకుండా నోటితో పుణ్యాలు, పాపాలు రెండూ చేస్తూ ఉంటాడు. దీనిని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు :

దాసుడు పరధ్యానంగా ఉండి దేవునికి నచ్చే మాట మాట్లాడే స్తాడు. దానివల్ల దేవుడు అతని అంతస్తులెన్నో పెంచుతాడు. అయితే దాసుడు ఒక్కోసారి పరధ్యానంలో ఉండి దేవునికి ఆగ్రహం తెప్పించే మాట మాట్లాడేస్తాడు. దానివల్ల అతడు నరకంలో పడిపోతాడు. (బుఖారీ)

మనం మాట్లాడే ప్రతి మాట మన హెూదాను, మన వ్యక్తిత్వాన్ని, స్థాయిని మాత్రమే కాదు మన పరలోక సాఫల్య వైఫల్యాలను సైతం చాలా ప్రభావితం చేస్తాయని స్పష్టంగా అర్థమవుతుంది.

దేవుణ్ణి, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి పలికితే మంచి మాటే పలకాలి లేదా మౌనంగా ఉండాలి. (బుఖారీ, ముస్లిమ్)

నిస్సందేహంగా సత్యం సత్కార్యం వైపునకు నడిపిస్తుంది. సత్కార్యం స్వర్గం వైపునకు మార్గం సుగమం చేస్తుంది. ఎవడైనా (నిత్యం) సత్యం పలుకుతూ ఉంటే, చివరికి అతడు సత్యసంధు డని అల్లాహ్ వద్ద వ్రాసుకోబడతాడు. నిస్సందేహంగా అసత్యం అవిధేయత (పాపకార్యం) వైపునకు తీసుకుపోతుంది. అవిధేయత నరకానికి చేర్చుతుంది. ఎవడైనా (నిత్యం) అసత్యమే పలుకుతూ ఉంటే అతను అల్లాహ్ వద్ద అసత్యవాదిగా వ్రాసుకోబడతాడు. (బుఖారీ, ముస్లిమ్)

మంచి మాట, ఒక తియ్యని పలుకు కూడా సదఖాతో సమానం. (బుఖారీ)

ఒక దైవదాసుడి మనసును సంతోషపరచడం నిజంగానే గొప్ప సత్కార్యం. తక్కువగా మాట్లాడటం, చెడు, అనవసర విషయాల నుండి నోటిని రక్షించుకోవడం.

సమాజంలో అనునిత్యం జరిగే ఎన్ని అనర్థాలకు నోటిదురుసు తనం, అతి వాగుడే కారణమంటే అతిశయోక్తి కాదు. కేవలం నోరు అదుపు తప్పడం వల్లనే ఎన్ని గొడవలు జరుగుతున్నాయో మనకు తెలియనిది కాదు. మనిషి పాపాల్లో కూరుకుపోయే కారణాల్లో ఎక్కువ శాతం నోటి అనర్థాలే. అందుకే దైవప్రవక్త(స) నోటిని అదుపులో ఉంచుకోవాలి గట్టిగా ఆదేశించారు. అన్నిరకాల చెడు మాటల నుండే కాకుండా అవసరం లేని మాటలు, ప్రయోజనం లేని ప్రేలాపనల నుండి కూడా నోటిని సురక్షితంగా ఉంచుకోవాలని హితవు పలికారు.

మాట్లాడే అవసరం లేకపోతే మాట్లాడినా ప్రయోజనం లేదని తెలిసిపోతే మౌనంగా ఉండటమే అన్నివిధాల శ్రేయస్కరం. ఈ హితవులను ప్రవక్త(స) ముక్తి మోక్షాలకు సాధనాలని సెలవిచ్చారు.

❖

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**53 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 42. అష్ షూరా

14 జనుల్లో విభేదం పొడసూపడం అన్నది, వారి వద్దకు జ్ఞానం వచ్చేసిన తరువాతనే జరిగింది.[22] అదీ, వారు ఒండొకరిపైన దౌర్జన్యం చెయ్యాలని అనుకోవడం వల్లనే జరిగింది.[23] నీ ప్రభువు ముందుగానే ఒక నిర్ణీత కాలం వరకు తీర్పు వాయిదా వెయ్యాలని పురమాయించి ఉండకపోతే వారి వివాదం తీర్చివెయ్యబడి ఉండేది.[24] వాస్తవం ఏమిటంటే, పూర్వపు వారి తరువాత గ్రంథానికి వారసులయినవారు దాని విషయంలో ఎంతో కలత కారకమయిన ఆశంకలో పడి ఉన్నారు.[25]

15 ఈ పరిస్థితి ఎలాగూ నెలకొన్నది గనుక ముహమ్మద్, ఇక నీవు ఆ ధర్మం వైపునకే పిలుపు నివ్వు. నీకు ఆదేశించిన విధంగా దాని మీదనే పటిష్టంగా స్థిరపడు, ఈ జనుల కోరికలను అనుసరించకు,[26] వీరికి చెప్పివెయ్యి, "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథం ఏదయినా నేను దాన్ని విశ్వసిస్తున్నాను. మీ మధ్యన న్యాయం చెయ్యాలని నన్ను ఆదేశించడమయినది. అల్లాహ్ మటుకే మా ప్రభువూ మీ ప్రభువు కూడా. మా ఆచరణలు మాకూను, మీ ఆచరణలు మీకే వర్తిస్తాయి. మాకూ మీకూ మధ్య ఎటువంటి వాదులాట లేదు. అల్లాహ్ ఒక రోజున మనలనందరినీ ఏకత్రం చేస్తాడు, మరాయన వైపునకే అందరూ వెళ్ళవలసి ఉంది."

24. అంటే, అపమార్గాలు సృష్టించే, తెలిసీ వాటిని అనుసరించే, అపరాధానికి పాల్పడిన వారినందరినీ ప్రపంచంలోనే శిక్ష విధించి అంతమొందించడం జరిగి ఉండేది, కేవలం సన్మార్గాన్ని అవలంబించేవారినే వదలి వేయడం జరిగేది దీన్నిబట్టి దైవం దృష్టిలో సత్యబద్ధులయిన వారెవరో, మిథ్యావాదులెవరో తేలిపోయేది. కాని అల్లాహ్ ఈ ఖరాఖండి నిర్ణయాన్ని ప్రళయం వరకు వాయిదా వేశాడు. ప్రపంచంలో ఈ తీర్పు జరిగినట్లయితే మానవాళిని పరీక్షించే పథకం అర్థరహితమయిపోతుంది.

25. భావమేమిటంటే, ప్రతి ప్రవక్త, ఆయన సమీప అనుయాయుల కాలం తీరిపోయిన తరువాత, తరువాతి తరాలకు దైవ గ్రంథం అందినప్పుడు వారు దానిని దృఢ విశ్వాసం, గట్టి నమ్మకంతో పరిగ్రహించలేదు. దాన్ని గురించి తీవ్రమయిన సంశయంలో, మానసికమయిన చిక్కుల్లో పడిపోయారు. ఇలా వారు ఈ స్థితికి లోనవడానికి అనేక కారణాలున్నాయి. దీన్ని మనం, తౌరాత్, ఇన్జీల్ వ్యవహారంలో సంభవించిన పరిస్థితుల అధ్యయనం వల్ల సునాయాసంగా గ్రహించగలము. ఈ రెండు గ్రంథాలనూ మునుపటి తరాల వారు వాటి అసలు స్థితిలో, వాటి మూల వచనంలో, మూల భాషలో భద్రంగా పెట్టి తరువాతి తరాలకు అందజేయలేదు. వాటిలో దైవ వచనంతోపాటు వ్యాఖ్యానం, చరిత్ర, వినికిడి ఉల్లేఖనాలు, ధర్మశాస్త్రవేత్తలు అన్వయింపజేసిన నిమ్న విషయాల రూపంలోని మానవీయ వచనం సయితం కలగాపులగం చేసివేశారు. వాటి అనువాదాలను బహుళ ప్రచారంలోకి తెచ్చి మూలమే మాయమయిపోయేలా, కేవలం అనువాదాలే మిగిలిపోయేలా చేశారు. వాటి చారిత్రక ప్రమాణాన్నీ కోల్పోయారు. ఇప్పుడు ఏ వ్యక్తి అయినా గట్టి నమ్మకంతో చెప్పలేడు, తన చేతుల్లో ఉన్న గ్రంథం హజ్రత్ మూసా (అ), లేదా హజ్రత్ ఈసా (అ) ద్వారా ప్రపంచ ప్రజలకు అందిన గ్రంథమే అని. అంతేకాక వారి పెద్దలు అప్పుడప్పుడు మతం, దైవిక తత్వం, తత్వశాస్త్రం, చట్టం, భౌతిక శాస్త్రం, మానసిక శాస్త్రం, సామాజిక శాస్త్రం ఇత్యాది విషయాల చర్చలు ప్రారంభించి ఒక నవీన ఆలోచనా పంథాకు పునాది వేశారు. ఫలితంగా ప్రజలు వాటి పద్మవ్యూహంలోనే చిక్కుకుని ఈ సమస్యా భూయిష్టమయిన మార్గాల గుండా సత్యానికి చేర్చే రుజుమార్గం ఏదో తేల్చడం అసాధ్యమయిపోయింది. దైవ గ్రంథం దాని అసలు రూపంలో, విశ్వసనీయ స్థితిలో లేకపోవడం చేత జనులు, సత్యాన్ని అసత్యం నుండి వేరు చేసేందుకు తోడ్పడే ఏ ప్రమాణం వైపునకూ మరిలే అవకాశమే లేకపోయింది.

26. అంటే, వారిని సంతోషపెట్టడానికి ఈ ధర్మంలో ఏదయినా మార్పులు చేర్పులు, హెచ్చుతగ్గులు చేయబాకు. "ఇచ్చిపుచ్చుకునే" సూత్రంపైన ఈ మార్గవిహీనులయిన ప్రజలతో ఎటువంటి సంధి కుదుర్చుకోవద్దు. వీరి మూఢ నమ్మకాలు, అభిమాన దురభిమానాలు, అజ్ఞానపు విధానాలు– వీటికై ధర్మంలో ఏదయినా వీలు కల్పించడం అన్నది, వారు ఏ విధంగానయినా ఇస్లామ్ పరిధిలోకి రావాలన్న ఆశతో చేయబాకు. ఎవరు నమ్మదానికి సంసిద్ధులో వారు దైవం పంపిన అసలు, నిర్మలమయిన, పరిశుద్ధమయిన ధర్మాన్ని ఆయన పంపినది పంపినట్టుగా సక్రమంగా స్వీకరించాలి, లేకపోతే ఏ నరకపు గోతిలో పడదలచినా పడిపోవచ్చు. దైవ ధర్మాన్ని జనుల కోసమని మార్చడం సంభవం కాదు. జనులు తమ సాఫల్యం కోరుకున్నట్లయితే తమను తాము మార్చుకుని దానికనుగుణంగా మలచుకోవాలి.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా౯ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**308)** హజ్రత్ అబూ దర్దా (రజి) వివరించారు: నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్) దగ్గర ఉన్న సమయంలో హజ్రత్ అబూబక్ర్(రజి) తన వస్త్రం అంచును పట్టుకుని, మోకాలు కనిపిస్తున్న స్థితిలో అక్కడికి వచ్చారు. దైవ ప్రవక్త(స) ఆ పరిస్థితిని చూసి, "మీ  మిత్రుడు ఎవరితోనో గొడవ పడినట్లుగా ఉన్నాడ"ని చెప్పారు. అబూబక్ర్(రజి) అక్కడకు రాగానే సలామ్ చేసి, 'దైవప్రవక్తా! నాకూ – ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)కు మధ్య మాటామాటా పెరిగింది. ఆ సందర్భంగా నేను తొందరపడి, ఆయనతో పరుషంగా మాట్లాడాను. కాని తరువాత నా వల్ల జరిగిన పొరపాటుకు పశ్చాత్తాపపడి, క్షమించమని ఆయన్ని అభ్యర్థించాను. కాని ఇప్పుడాయన నాకు క్షమాభిక్ష పెట్టడానికి సిద్ధంగా లేరు. అందుకే నేను మీ సన్నిధిలో హాజరయ్యాను (దయచేసి తమరు ఆయనకు కాస్త నచ్చజెప్పండి), అని విన్నవించుకున్నారు. ఇది విని, "అబూబక్ర్! అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక!" ఆయన(స) మూడుసార్లు ఈ మాట పలికారు. ఈ లోగా హజ్రత్ ఉమర్(రజి) కూడా తన ధోరణిని తలచుకుని సిగ్గుతో కుంచించుకు పోయారు.  హజ్రత్ అబూబక్ర్(రజి) ఇంటికివెళ్ళి, 'అబూ బక్ర్(రజి) ఉన్నారా?' అని అడిగారు. లేరని తెలుసుకుని ఆయన కూడా దైవ ప్రవక్త(స) దగ్గరకు వచ్చారు. వచ్చీరాగానే సలామ్ చేశారు. దైవప్రవక్త(స) ముఖార విందం ఆగ్రహంతో కందిపోయింది. అబూబక్ర్(రజి) భయపడిపోయారు. మోకాళ్ళపై కూర్చుని, 'యా రసూలల్లాహ్! దైవసాక్షిగా చెబుతున్నాను– ఈ వ్యవహారంలో తప్పు నా వల్ల జరిగింది' అన్నారు. ఈ మాట రెండుసార్లు పలికారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "అల్లాహ్ నన్ను మీ వద్దకు ప్రవక్తగా చేసి పంపాడు. మీరంతా నన్ను అబద్ధీకరించినప్పుడు, అబూబక్ర్ నన్ను సత్యవంతుడని ధ్రువ పరిచారు. తన ధన ప్రాణాల ద్వారా ఆయన నాకు సహాయపడ్డారు. మరి అలాంటప్పుడు మీరు నా మిత్రుణ్ణి సాధించటం మానుకుంటారా? లేదా?" ఆయన(స) రెండు సార్లు ఈ విధంగా ప్రశ్నించారు. దైవప్రవక్త(స) ఈ విధంగా చెప్పిన నాటి నుంచీ అబూబక్ర్(రజి) మనసును ఎవరూ నొప్పించలేదు.[1]

**312)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: "ఎవరయితే తన అంగ వస్త్రాన్ని (ఇజారు గానీ,  షరాయి గానీ,  లుంగీ గాని) గర్వాతిశయంతో, అహంకారంతో నేలకు రాసుకునేలా కట్టుకుని తిరుగుతాడో అతనిపై అల్లాహ్ ప్రళయదినాన తన కటాక్ష వీక్షణాలను ప్రసరింపజెయ్యడు". దీనిపై హజ్రత్ అబూబక్ర్(రజి), 'నా అంగ వస్త్రంలోని ఒక భాగం– అప్పుడప్పుడూ– నేలకు రాసుకుంటూ ఉంటుంది. అయితే నేను జాగ్రత్తగా నడిచినప్పుడు అది రాసుకోదు' అని సందేహపడగా, "నీవు అహంకారం వల్ల అలా చేయవు కదా! (అందుచేత ఈ ఆజ్ఞ నీకు వర్తించదు)" అని దైవ ప్రవక్త(స) చెప్పారు. మూసా బిన్ ఉఖ్బా ఇలా అన్నారు: అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి)  ఈ హదీసులో 'తన ఇజారును ఈడ్చుకుంటూ నడిచే వ్యక్తి'  అని చెప్పారా? అని నేను సాలిమ్‌ను అడగ్గా,  'ఎవడు తన వస్త్రాన్ని వ్రేలాడదీసుకుంటూ నడుస్తాడో' అని ఆయన ద్వారా నేను విన్నాను అని చెప్పారు.[1]

308-1. అబూ యాలా ఉల్లేఖనంలో ఇలా వుంది: హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చినప్పుడు ఆయన(స) ముఖం త్రిప్పుకున్నారు.  ఉమర్ ఆ వైపు నుండి వస్తే అటు నుంచి కూడా ముఖం త్రిప్పుకున్నారు. ఎదురుగా వచ్చి కూర్చుంటే, అప్పుడు కూడా ముఖం త్రిప్పుకున్నారు. తన పట్ల కినుక వహించడానికి కారణం ఏమిటి? అని ఉమర్ అడగ్గా, "క్షమించమని అబూబక్ర్ అభ్యర్థిస్తే నీవు క్షమించ లేదు. ఎందుకని?" అని దైవప్రవక్త(స) నిలదీశారు.

ఈ హదీసు ద్వారా అబూబక్ర్(రజి) గొప్పతనం అవగతం అవుతోందని హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) వ్యాఖ్యానించారు. నిజానికి మొదట తప్పు అబూబక్ర్(రజి) ద్వారానే జరిగింది. కాని  ఆయన తన తప్పును గ్రహించగానే క్షమాపణ కొరకు అర్థించారు.

312-1. ఆచరణలు  సంకల్పంపై ఆధారభూతమై ఉంటాయి. ఒక వ్యక్తి ఎవరయినా తన  అంగవస్త్రం  విషయంలో  జాగ్రత్తపడతాడు. గిలకలపైన ఉండేలా ధరిస్తాడు. కాని అతని అణువణువునా గర్వం పెనవేసుకుని ఉంటుంది. ఇలాంటి గర్విష్టికి వినాశం తథ్యం.  అలాగే పరధ్యానంలో ఒక వ్యక్తి అంగవస్త్రం నేలకు రాసుకున్నంత  మాత్రాన ప్రమాదం ఏమీ లేదు. అల్లాహ్ మనిషి సంకల్పాన్ని చూస్తాడు. అయితే బాహ్యంలో కూడా మనిషి వీలైనంత వరకు జాగ్రత్తగా వ్యవహరించటం మంచిది.



2

# గాఢాంధకారం

**(ఇస్లామ్ ప్రవక్త ప్రభవించే నాటికి ప్రపంచ ఆధ్యాత్మిక, నైతిక పరిస్థితి)**

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## క్రైస్తవ రోము

**ఇస్లాం** ఆరంభ కాలంలో పారసీక సామ్రాజ్యం భౌతికంగా, ఆధ్యాత్మికంగా పతనావస్థలో ఉన్నట్లే రోము సామ్రాజ్య పరిస్థితి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. గ్రీకు సంస్కృతి పతనమైన తర్వాత ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సామ్రాజ్యంగా ఖ్యాతి గడించిన రోము సామ్రాజ్యమిది. ఆ సామ్రాజ్యాధినేతల్లో జూలియస్ సీజర్ పేరు చరిత్రలో ఎల్లప్పుడూ వినవస్తూనే ఉంటుంది. ఆ సామ్రాజ్యంలోనే దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు– అలైహిస్సలాం) పుట్టి, తన శాంతి సందేశాన్ని వినిపించి సెలవు తీసుకున్నారు. ఆయన ఆరోహణ జరిగిన తరువాత కొద్ది కాలానికే ఆయన శిష్యుల్లో వర్గాలు, కూటములు పుట్టుకొచ్చాయి. చివరకు కొత్తగా క్రైస్తవం పుచ్చుకున్న యూదు పాల్ క్రైస్తవుల్లో తిరుగులేని మతాధిపతిగా రూపొందాడు. అతను తొక్కిన కొత్తపుంతల ధూళిలో అసలు సిసలు క్రైస్తవం పూర్తిగా కొట్టుకుపోయింది. తండ్రీ, కొడుకు, పరిశుద్ధాత్మల బహు దైవోపాసనా విశ్వాసం ఆ మతంలో జొరబడింది. పాత నిబంధనలోని ఒక్క అక్షరాన్ని కాదు కదా, ఒక్క పొల్లును కూడా దైవప్రవక్త ఈసా (ఏసు) చెరపలేదు. కాని తనను తాను ఏసుక్రీస్తు వారసుడుగా చెప్పుకున్న పాల్ చేతిలో అది ప్రక్షిప్తాలకు గురయింది. క్రీ.శ. 225లో రోము సామ్రాజ్యం రెండు ముక్కలుగా చీలిపోయింది. ఒకటి తూర్పు భాగం, రెండవది పశ్చిమ భాగం. తూరుపు భాగానికి అధిపతి అయిన కాన్‌స్టాంటి నోపుల్ ది గ్రేట్ క్రైస్తవ మతం స్వీకరించాడు. క్రమక్రమంగా రోము రాజ్యమంతటా క్రైస్తవ మతం వ్యాపించింది. ఆ రాజ్యాధిపతి క్రైస్తవ స్వీకారం వెనుక మత భావన కన్నా రాజకీయ ప్రయోజనాలు ఎక్కువగా ఉండేవి. తత్ఫలితంగా 'తండ్రీ, కుమారుడు, పరిశుద్ధాత్మ'ల త్రిత్వంలో రోము జయించే ప్రతి రాజ్యం ఏదో ఒక దానిని విధిగా అవలంబించవలసి వచ్చేది. రాను రాను విశ్వాసపరమైన విభేదాలు రచ్చకెక్కాయి. మతాధిపతులు రాజ్యాధిపతుల దర్బారులో కూర్చుని దైవధర్మ రూపు రేఖలను చిత్రించసాగారు. ఐకమత్యం పేరిట, సదస్సుల పేరిట వారు చేసే ప్రతి ప్రయత్నం ఓ కొత్త కూటమికి దారి తీసేది. ఒక్క శతాబ్ది కాలంలోనే క్రైస్తవ మతం ఇరవైకన్నా ఎక్కువ కూటములుగా చీలిపోయింది.

క్రీ.శ. 337లో కాన్‌స్టాంట్ నోపుల్ మరణంతో మతపరమైన అంతర్యుద్ధంతో పాటు, రోమనుల రాజకీయ పరమైన అంతర్యుద్ధాగ్ని జ్వాలలు కూడా మిన్నంటాయి. రాజ్యంలో కొంగ్రొత్త వర్గాలు అనేకం పుట్టుకు వచ్చాయి. పరస్పర వంచన, దగా, మోసం, కలహాలు దావానలంలా వ్యాపించాయి. చివరకు రోము సామ్రాజ్యం వివిధ రాష్ట్రాలుగా విభజితమైంది, అనేకమంది పరిపాలకులు వచ్చారు. ఇదే అదనుగా ఆటవిక జాతులు దండయాత్రలు సాగించాయి. అదే సమయంలో అసమ్మతివాదులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పర్యవసానంగా 5వ శతాబ్ది ఆఖరికల్లా రోము సామ్రాజ్యంలోని పశ్చిమ భాగం (ఇది బ్రిటన్, ఫ్రాన్స్ తదితర రాజ్యాలతో కూడుకుని ఉండేది) పూర్తిగా వేరైపోయింది. రోము సామ్రాజ్య రాజధాని నగరం సయితం శత్రువుల దాడుల నుండి సురక్షితంగా ఉండలేకపోయింది.

అధికారులు, మంత్రులు తమ ఖర్చుల భారాన్ని కూడా ప్రజా

సామాన్యంపై రుద్దటం మొదలెట్టారు. తత్కారణంగా ప్రజలు తమ స్వల్ప ఆదాయానికి కూడా నోచుకోకుండా పోయారు. పన్నుల వసూళ్ళ నిమిత్తం అధికారుల కఠిన చర్యల వల్ల ప్రజా బాహుళ్యంలో ప్రభుత్వం పట్ల ద్వేషం, వైరభావం పెచ్చరిల్లింది. ఒకప్పుడు రోమన్ సామ్రాజ్యంలో పౌరులైనందుకు గర్వపడే ప్రజలు ఇప్పుడు రోమను పరిపాలకులకు బదులు తమ రాజ్యంపై దండెత్తివచ్చే క్రూర జాతులకు ప్రాధాన్యత ఇవ్వసాగారు. పరిపాలకులు, మంత్రులు తమ హ్రస్వదృష్టి కారణంగా ప్రజలను తమ శత్రువులుగా తయారు చేసుకున్నారు. ప్రజలు తిరగబడినప్పుడు సైనిక చర్య గైకొనేవారు. కాని ఓటమినే మూటకట్టుకోవలసి వచ్చేది.

5వ శతాబ్ది చివర్లో సామ్రాజ్య పశ్చిమ భాగం చేజారిపోయిన తరువాత తూర్పు ప్రాంతంలో కూడా రాజకీయ సుస్థిరత కరువైపోయింది. చరిత్రకారుల ప్రకారం ఒకప్పుడు రోమన్ సైనికుల సంఖ్య 6,45,000 ఉండేది. కాని జస్టినీన్ కాలంలో (క్రీ.శ. 527) ఆ సంఖ్య 1,50,000కు పడిపోయింది. మరి ఆ సైన్యం కూడా చెల్లాచెదురుగా, బలహీనంగా ఉండేది. ప్రజల జేబులు ఖాళీ అయిపోయాయి. సైనికులకు ప్రభుత్వం జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి? ప్రభుత్వాధికారులు తమ స్వంత ఖర్చుల నిమిత్తం అవినీతి, లంచగొండితనానికి ఒడిగట్టేవారు. మోసపూరితంగా – దొడ్డిదోవలో – ప్రజల నుండి పన్నులు వసూలు చేసేవారు. సైనికుల జాబితాలో చాలామంది సిపాయిల పేర్లు వ్రాయబడి ఉండేవి. కాని యుద్ధరంగానికి వెళ్ళాలనే సరికి చాలా కొద్దిమంది మాత్రమే సిద్ధయ్యేవారు. సైనికాధికారులు సిపాయిలకు శిక్షణ ఇచ్చేబదులు తమ సమయాన్ని పరస్పర కీచులాటలలో వెచ్చించేవారు. ప్రతి సైనికాధికారి మరో సైనిక ఆఫీసర్‌పై బురదజల్లి, అతనిని అవమానపరచి తన ప్రమోషన్‌కు మార్గం సుగమం చేసుకునేందుకు యత్నించేవాడు.

అంతఃకలహాల సంగతి ఇలా ఉంటే విదేశీ దండయాత్రలతో సైన్యానికి ఊపిరి పీల్చుకునే అవకాశం కూడా దొరికేది కాదు. రోము – పారసీక సామ్రాజ్యాల మధ్య సుదీర్ఘ కాలంగా ఎడతెగని యుద్ధ పరంపర కొనసాగుతూ వస్తోంది. అదే సమయంలో రోంబాడూన్, గోథీన్ తదితర క్రూర జాతులు నిరంతరం దాడిచేసి రాజ్య శక్తిని నిర్వీర్యం చేసేవి.

మొత్తానికి 6వ శతాబ్ది ముగింపు దశకు వచ్చేసరికి – అంటే మహా ప్రవక్త ముహమ్మద్ (స) జననానికి రెండు మూడేళ్ళ తర్వాత రోము సామ్రాజ్యం పతనపు చివరి అంచులకు చేరుకుంది. గిబ్బన్ మాటల్లోనే చెప్పాలంటే, ఒకప్పుడు శాఖోపశాఖలుగా విస్తరించి ప్రపంచంలోని ఎన్నో జాతులకు నీడనిచ్చిన ఆ మహా వృక్షం పెనుగాలుల తాకిడికి ఊగిపోయింది. దాని కొమ్మలు రెమ్మలు విరిగిపోయాయి. ఇప్పుడది బలహీనమైన, వాడిపోయిన మొదలుగా మిగిలింది. ఏ క్షణంలోనయినా సింహాసనానికి ఎసరుపెట్టే దాడి జరగవచ్చునన్న భయం రాజధానిలో నివసించే ప్రజల్లో ఏర్పడింది. వారు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ జీవించేవారు. మార్కెట్లలో వ్యాపారం స్తంభించింది. వినోద స్థలాలు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఎటు చూసినా శ్మశాన శాంతి కానవచ్చేది. ఒకప్పుడు విషయ లోలురుగా బ్రతికినవారు ఇప్పుడు బలవంతపు బ్రహ్మచారులుగా తయారయ్యారు.

రాజ్యంలోని సాధారణ రాజకీయ, నైతిక పరిస్థితుల పట్ల చూపోపు వహించి, మనం అక్కడి మతపరమైన స్థితిగతులపై దృష్టిని సారించినట్లయితే ఇంతకన్నా ఎక్కువ మనో వ్యధను కలిగించే దృశ్యం కానవస్తుంది. విగ్రహారాధకులైన ప్రజల సంగతిని అలా వుంచితే, నక్షత్రాలను, దేవీదేవతలను పూజించటంలో నిమగ్నులై ఉన్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. క్రైస్తవ మతం పుచ్చుకున్నవారు సైతం తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ మరియు మరియమ్మలను దైవాలుగా నమ్మేవారు. ఈసా(అ), మర్యమ్, పరిశుద్ధాత్మల పేరిట డజన్ల సంఖ్యలో వర్గాలు, కూటములు పుట్టుకొచ్చాయి. వారి మధ్య జరిగే సంవాదనలు కాస్తా గలాటాలకు, గొడవలకు దారి తీసేవి. కడకు క్రీ.శ. 514లో స్వయంగా క్రైస్తవుల రెండు వర్గాల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. ఆ యుద్ధ సందర్భంగా 65 వేలమంది క్రైస్తవులు నగర బహిష్కారానికి గురికావలసి వచ్చింది. ఈ మహా సంగ్రామం సంగతిని అలా పక్కనపెడితే, నిత్యం ఒక కూటమి మరో కూటమిపై కయ్యానికి కాలుదువ్వేది. ప్రతి చిన్న సంఘటన చిలికి చిలికి గాలివానగా మారేది. రక్తం చిందించబడేది. మతాధిపతులు (పారసీలు) తమ మతపరమైన హోదాలను అధికార వైభవానికి సాధనంగా చేసుకున్నారు. ఈ విధంగా వారు పదవుల కోసం, పటాటోపం కోసం అన్ని రకాల అధర్మమైన పైరవీలలో తలమునకలై ఉండేవారు. ఆ మతాధిపతులలో ఒకడు సరల్. అతని దురంతాల గురించి రాయాలంటే ప్రత్యేకంగా ఒక పుస్తకమే రాయాల్సి వస్తుంది. ఒకసారి అతను తన అనుంగు అనుయాయులతో కలసి నిరాయుధులైన యూదులపై ఆకస్మిక దాడి జరిపాడు. ఆ యూదులందరినీ రాజ్యం నుండి వెళ్ళగొట్టాడు. వారి ధన సంపత్తులు, వస్తుసామగ్రి మొత్తం సరల్ శిష్యుల వశమయింది. వారి ఆరాధనాలయాలు నేలమట్టం చేయబడ్డాయి. సరల్ ప్రత్యర్థిగా ఆనాడు అరిస్టస్ అనే ఒక ఫాదర్ ఉండేవాడు. ఒక రోజు అరిస్టస్ దారిగుండా సాగిపోతుండగా 500 మంది క్రైస్తవ సన్యాసుల బృందం అతనిపై విరుచుకుపడింది. రాళ్ళు రువ్వి అతనికి రక్తాభిషేకం చేసింది. సరల్‌కు బలీషా అనే ఒక స్నేహితురాలుండేది. ఒకరోజు ఆమె తన విద్యాపీఠం నుండి తిరిగి వస్తుండగా సన్యాసుల ఒక పెద్ద గుంపు ఆమెపై దాడిచేసింది. ఆమెను వాహనం నుంచి క్రిందికి దించి వివస్త్రను చేశారు. అదే (నగ్న) స్థితిలో ఆమెను రోడ్లపై ఈడ్చుకుంటూ చర్చికి తీసుకువచ్చారు. అక్కడ ఆమెను చిత్రవధకు గురిచేసి, చంపేశారు. హత్యానంతరం ఆమె శరీర మాంసం ఎముకల నుండి వేరుచేయబడింది. మృత దేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి అగ్నికి ఆహుతి చేశారు. ఈ అమానుష సంఘటనల్ని గురించి రాయడానికి కూడా చేతులు

వణుకుతున్నాయి. ఇవీ క్రైస్తవ మత ధ్వజ వాహకుల ఘనకార్యాలు!

సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఆ మహా సామ్రాజ్యంలోని డొల్లతనం బహిర్గతం కాసాగింది. క్రైస్తవ మతం కొత్త పుంతలు తొక్కింది. ఏసుక్రీస్తు (ఈసా – అలైహిస్సలాం) చేసిన ప్రబోధనల నుండి వైదొలగింది. బలహీనమయిన విశ్వాసాలు మతంలో జొర బడ్డాయి. సమాధిపూజ సర్వసామాన్యమైపోయింది. మృతి చెందిన ప్రతి పెద్ద మతాధిపతి సమాధి దగ్గరకు పోయి క్రైస్తవులు వేడుకోళ్ళు, విన్నపాలు చేసుకునేవారు. సిరియాలోనైతే ఇది మరీ ఎక్కువైపోయింది. చనిపోయిన మతాచార్యుల సమాధులను సంద ర్శించి ప్రజలు సాష్టాంగ ప్రణామం చేసేవారు. ఏసుక్రీస్తు, మర్యమ్, హవారీలు, ఇతర క్రైస్తవ సన్యాసుల విగ్రహాలు తయారుచేసి, వాటిని మొక్కేవారు. ఈ రకమయిన విగ్రహారాధనా దృష్టాంతం తరువాతి కాలంలో ప్రబలిన రోమన్ కేథలిక్ వర్గంలో కూడా కానరాదు.

ఆ కాలంలోనే 'మర్యమ్' అనే మరో కొత్త వర్గం పుట్టుకువచ్చింది. ఈ వర్గీయులు హజ్రత్ మర్యమ్ (అలైహిస్సలాం)ను కూడా దైవ త్వంలో భాగస్వామినిగా చేర్చారు. ఆ విధంగా 'త్రిత్వం' ఉన్న చోటే నలుగురు దైవాల భావన ఆవిర్భవించింది. దివ్య ఖుర్ఆన్ ఆలి ఇమ్రాన్ సూరాలో ఇది ఖండించబడింది. వ్యవహారం అంతటితో ఆగలేదు. విగ్రహారాధనను ప్రేరేపించే ఇంకెన్నో కూటములు క్రైస్తవంలో చేరాయి. పేర్లు మార్చి రోమన్ విగ్రహారాధకులు కొత్త కొత్త విగ్రహాలను చర్చీలలో ప్రతిష్ఠించేవారు. వివిధ కూటముల మధ్య గల విభేదాలు ఒక్కోసారి తారస్థాయికి చేరి, సిగపట్లకు సిద్ధ మవటంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని వారికి సర్ది చెప్పాల్సి వచ్చేది. క్రమేణా అవినీతి పెచ్చరిల్లింది. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే ప్రాపంచికంగా పెద్ద పదవిలో ఉన్న వ్యక్తికి ఎవరెంత సన్నిహితులుగా ఉంటారో వారికి మతపరంగా అంత పెద్ద పీట వేయబడేది.

ఇదీ క్రైస్తవ ప్రపంచపు తూర్పు ప్రాంతాల పరిస్థితి. ఇక పశ్చిమ ప్రాంతాన్ని చూస్తే అది ఇంతకన్నా అధ్వాన్నంగా ఉండేది. అక్కడ రోమన్ సామ్రాజ్యాధినేత ఆధ్వర్యంలో మతపరమైన హోదాల కోసం రక్తపాతం జరగటం అతి సామాన్యమయిన విషయం. ఒక్కోసారి ఈ పదవుల పందేరంలో హతుల సంఖ్య ఒక సంగ్రామంలో జరిగిన మరణాలకు సరిసమానంగా ఉండేది. ఒకసారి ఒక కీలక పదవి కోసం ఇద్దరు మతాచార్యులు పోటీపడినప్పుడు ఒకే ఒక్క రోజులో 137 మంది అసువులు బాసారు. పదవుల కోసం ఇంత హోరా హోరీ పోరాటం ఎందుకు జరిగేదంటే; ఒకసారి ఆ పదవిని అలంక రించిన వారి వైభవం చూడతరమా! అన్నట్టు ఉండేది. వారి ఐశ్వర్యం, భోగభాగ్యాలు, సన్మానాలు వర్ణనాతీతం! వారి డైనింగ్ హాల్‌లో లభ్యమయ్యే ఖరీదైన వంటకాలు, స్వాదిష్టమయిన ఆహార పదార్థాలు చక్రవర్తులకు కూడా లభించేవి కావు.

చక్రవర్తుల, మతాధిపతుల నీతీనడవడికల ప్రభావం సహజంగానే సామాన్య ప్రజలపై పడుతుంది. తత్ఫలితంగా అవినీతి, దుబారా ఖర్చు, మనోవాంఛల దాస్యం క్రైస్తవ జగతి గాలి నీరులో కలసి పోయాయి. ప్రజలు అన్ని రకాల అధర్మమైన మార్గాల ద్వారా డబ్బు సంపాదించి, తమ భోగలాలస జీవితం కోసం డబ్బును తగలెట్టేవారు.

పోపులు ఆ తర్వాత స్థానాల్లో ఉన్న మతాధిపతులు తమను తాము రాజులుగానూ, దైవాంశసంభూతులుగానూ ఊహించుకునేవారు. దైవాధికారాలను తమ చేతుల్లోకి తీసుకునేవారు. తాము భువిపై తెరిచేదే ఆకాశాలలో తెరువబడుతుందనీ, తామిక్కడ మూసివేస్తే అక్కడా మూసివేయబడుతుందని నమ్మబలికేవారు. వారి ఈ పరిస్థితిని గురించి ప్రస్తావిస్తూ దివ్య ఖుర్ఆన్, "వారు నిజ దైవాన్ని వదలి తమ పండితులను, సన్యాసులను తమ దైవంగా చేసుకు న్నార"ని చెప్పింది.

మతావలంబనలో అత్యంత ముఖ్యమైనది సన్యాసత్వంగా భావించ బడేది. అన్ని రకాల సుఖ సౌఖ్యాలకు దూరమై శరీరాన్ని హింసించి, బాధించడం అత్యుత్తమమైన ఆరాధనగా పరిగణించబడేది. అందుకే వారిలో ఒకడు జీవితాంతం స్నానం చేయనని ఒట్టేసుకుంటే, తాను కడదాకా ఊబిలోనే ఉంటానని మరొకడు ప్రతిన బూనాడు. ఒకడు తనను తాను సంకెళ్ళలో బంధించుకుంటే, ఇంకొకడు జీవితాంతం చెట్టు నీడ క్రింద కూర్చోనని ఒట్టేసుకున్నాడు. వేరొకడు చీకటి గదిలో తనను నిర్బంధించుకున్నాడు. తల్లిదండ్రులు, సమీప బంధు వులు, ఆలుబిడ్డలు సాత్విక మార్గంలో ముళ్ళుగా భావించబడ్డారు. అందుకే భవబంధాలను త్రెంచుకోవటం, వాటిని అసహ్యించు కోవటం ధర్మనిష్ఠకు తార్కాణంగా భావించటం జరిగింది.

## భారత దేశం

మత భావన గల నాగరిక దేశాలలో భారత దేశం ఒకటి. భారతదేశ నాగరికతలో ఐదు యుగాలు గడిచాయి. వాటిలో సిసలైన హైందవ మతం వైదిక యుగంలో క్రీ.పూ. 2000 సంవత్సరం నుండి సుమారు క్రీ.పూ.1400 సంవత్సరం వరకు ఉంది. రెండవ యుగం కౌరవులు – పాండవుల రాజకీయ సంఘర్షణతో కూడుకున్నది. ఇది క్రీ.పూ. 1400 మొదలుకుని సుమారు క్రీ.పూ. 1000 వరకు ఉంది. మూడవ యుగం విజ్ఞుల, బుద్ధిజీవుల యుగంగా పేర్కొనబడింది. ఇది క్రీ.పూ. 1000 నుండి క్రీ.పూ. 3వ శతాబ్ది వరకు ఉంది. నాల్గవ యుగంలో బౌద్ధమతం బాగా ప్రాచుర్యంలో ఉండేది. ఈ యుగం క్రీ.పూ. 250 మొదలుకుని క్రీ.శ. 5వ శతాబ్ది వరకు ఉంది. ఐదవ యుగం పౌరాణిక యుగం. ఇందులో వేదాలు, గౌతమ బుద్ధుని ప్రబోధనలకు బదులు పురాణాల ప్రకారం అమలు జరిగేది. ఈ యుగం సుమారు క్రీ.శ. 5వ శతాబ్ది చివరి నుండి ముస్లింలు భారత దేశానికి వచ్చేవరకు కొనసాగింది.

ప్రాచీన భారతదేశ చరిత్రలో అత్యంత అంధకార యుగం, లోప భూయిష్టమైన యుగం ఇదే. ఇది క్రీ.శ. 500 నుండి మొదలవు తుందన్న దానిపై చరిత్రకారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ యుగంలోని ప్రత్యేకతలు ఇవి :

1. భారతదేశం అణువణువునూ పెనవేసుకుని ఉన్న బహుదైవారాధన ఈ యుగంలో పరాకాష్ఠకు చేరుకుంది. వైదిక యుగంలో 33 దేవతలుండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 33 కోట్లకు చేరుకుంది. (ఆర్.సి. దత్‌చే విరచితమైన ప్రాచీన భారతదేశం).
2. వైదిక యుగంలో విగ్రహపూజ ఉండేది కాదు. కాని పౌరాణిక యుగంలో విగ్రహారాదన మందిరాలలో సర్వసామాన్యమైపోయింది.
3. దేవాలయాల ధర్మకర్తలు, సంరక్షకులు అశ్లీలానికి, అవినీతికి మూల కారకులుగా ఉండేవారు. వారు లక్షలాది, కోట్లాది మంది అమాయక భక్తులను మతం పేరిట దోచుకునేవారు.
4. వైదిక యుగంలో హైందవ జాతిలో ఐకమత్యం, సంఘీభావం ఉండేది. కాని ఇప్పుడు కులతత్వం ప్రబలింది. నిమ్నోన్నతా భేదభావాలు పుట్టుకు వచ్చాయి. ఇవి సామాజిక వ్యవస్థ పాలిట వినాశకరంగా పరిణమించాయి.
5. స్త్రీలను దాసీలుగా మార్చివేయటం జరిగింది.
6. అనుచితమైన అన్యాయమైన శాసనాలు క్రోడీకరించబడ్డాయి. వాటి ఆధారంగా కొన్ని వర్ణాలను పరిరక్షించి, మరికొన్ని వర్ణాలను దారుణంగా అణచివేయటం జరిగింది. ఉదాహరణకు అలాంటి కొన్ని శాసనాలు ఇవి :

(i) బ్రాహ్మణులు ఎలాంటి నేరాలకు పాల్పడినాసరే – ఎట్టిపరిస్థితిలోనూ వారికి మరణ శిక్ష విధించబడదు.

(ii) అగ్రవర్ణానికి చెందిన ఒక వ్యక్తి అధమ వర్ణానికి చెందిన స్త్రీతో వ్యభిచరిస్తే, అది నేరంగా పరిగణించబడదు.

(iii) ఆఖరికి ఎవరయినా ఒక బౌద్ధమత సన్యాసిని శీలాన్ని అపహరించినా సరే కొద్దిపాటి జరిమానా చెల్లిస్తే సరిపోయేది.

(iv) ఎవరయినా ఒక అంటరాని కులానికి చెందిన వ్యక్తి అగ్రవర్ణానికి చెందిన వ్యక్తిని ముట్టుకున్నాసరే అతనికి మరణశిక్ష తథ్యం.

(v) ఒకవేళ ఎవరయినా శూద్రుడు అగ్రవర్ణానికి చెందిన వ్యక్తిని కొడితే అతని శరీరావయవం నరకబడుతుంది. తిడితే అతని నాలుక కోసివేయబడుతుంది. ఒకవేళ అతనికి ఏదయినా నీతి బోధ చేసినట్లయితే సలసలా కాగే నూనె అతని నోట్లో వేయబడుతుంది.

6. రాజ దర్బారులో మద్యసేవనం సర్వసాధారణమై ఉండేది. రాణులు తప్పత్రాగి, మైకంలో బట్టలు విప్పేసేవారు.
7. రహదారులపై బందిపోటు దొంగల ముఠాలుండేవి.
8. సత్యాన్వేషణ పేరిట సాత్వికులు ప్రజా బాహుళ్యానికి దూరంగా పోయి కొండల్లో, అడవుల్లో కఠోర అభ్యాసాలకు, తపస్సులకు పూనుకునేవారు. శరీరాన్ని కృశింపజేయటం అత్యుత్తమమైన ఆరాధనగా పరిగణించబడేది.
9. దురాచారాలు, మూఢనమ్మకాలు, క్షుద్రవిద్యలు, భూత వైద్యాలు సర్వత్రా ప్రబలి ఉండేవి. నింగి నుండి నేల వరకూ ప్రతి వస్తువులో ప్రజలు దైవాన్ని చూసేవారు. ప్రతి వస్తువు ముందు ప్రణమిల్లేవారు. విగ్రహాలు, దేవీదేవతలు లెక్కలకు అందేవి కావు. ఇస్లాం ప్రభవనం తరువాత భారత దేశానికి వచ్చే అరబ్బు యాత్రీకులు, ఇక్కడ తపస్సులు చేసుకునే వారి బాధలను చూసి తల్లడిల్లిపోయేవారు. అలాగే సింధు లోయలో, దక్కన్ ప్రాంతంలో, సముద్ర తీరాలలో పర్యటించిన అరబ్బు యాత్రీకులు, దేవాలయాలలో పూజారుల చేతుల్లో నలిగిపోయిన దేవదాసీల దురవస్థను గురించి వ్రాసిన దానిని చదువుతుంటేనే ఒల్లు గగుర్పొడు స్తుంది. విచిత్రమేమిటంటే ఇదంతా 'దైవప్రసన్నత' పేరిట జరిగేది.

భార్యలపై జూదం ఆడేవారు. జూదంలో ఓడినవారు గెలిచిన వారికి తమ భార్యలను అప్పగించేవారు. ఒక స్త్రీకి అనేకమంది భర్తలుండేవారు. భర్త చనిపోయిన స్త్రీ జీవితాంతం వితంతువుగా దుర్భర జీవితం గడపాల్సిందే. పునర్వివాహం చేసుకునే హక్కు ఆమెకు ఉండేది కాదు. ఇలాంటి అవమానకరమైన జీవితంకన్నా భర్త చితిమంటలకు ఆహుతి కావటం మేలని కొంతమంది స్త్రీలు తలపోసేవారు. కొన్ని వర్గాలలో పురుషులు స్త్రీలను, స్త్రీలు పురుషులను వివస్త్రను చేసి పూజలు నిర్వహించేవారు. ఉత్సవాలు, జాతరల సందర్భంలో తప్పతాగి చిందులేసేవారు. ఆ సమయంలో తల్లి, చెల్లి, కూతురు, తనవారు, పరాయివారన్న విచక్షణ కూడా ఉండేది కాదు. పైగా అలా చేయటం పుణ్యకార్యంగా భావించబడేది. శూద్రులనే వారు విద్యాబుద్ధులకు, చదువు సంస్కారానికి, నీతీ నడవడికలకు ఆమడ దూరంగా బానిసల్లాగా బ్రతకాల్సిందే. ఒకవేళ వేదాల శబ్దం వారి చెవిలో పడినాసరే సీసం కరిగించి చెవుల్లో వేయమన్న ఆజ్ఞ ఉండేది.

రాజులు ఎంతమంది స్త్రీలనయినా వివాహం చేసుకోవచ్చు. చట్టం అనేది మానవ సమానత్వంపై కాకుండా కులంపై ఆధారపడి ఉండేది. స్త్రీల క్రయవిక్రయాలు జరిగేవి.

పుణ్యభూమిగా పేర్కొనబడే భారత దేశం ఇస్లాంకు పూర్వం పైశాచిక శక్తుల పద్మవ్యూహంలో చిక్కుకుని ఎలా విలవిల్లాడిపోయేదో ఊహించడానికి ఈ వివరాలు చాలు. ఒక విధంగా చెప్పాలంటే ఆనాటి భారత దేశ పరిస్థితి అలనాటి పారసీక, రోము రాజ్యాల పరిస్థితికన్నా మెరుగ్గా ఏమీ లేదు.

***(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ-రహ్మ- విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)***

**(మిగతా వచ్చే సంచికలో)**



# గురుశిష్యుల అనుబంధం

**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ**

**"ప్రభూ! నాకు మరింతజ్ఞానం ప్రసాదించు" అని వేడుకో (తాహా: 114)**

జీవితం అనే రంగస్థలంపై ఒకసారి ఆట మొదలెట్టాక మధ్యలోని ఆపలేము. చివరి శ్వాస ఆగేంత వరకు ఆడుతూనే ఉండాల్సిందే. అందునా ఆడడానికంటే ముందు సాధనంటూ చెయ్యలేని జీవులం. అలాంటి మనకు ఎంత కాలం జీవించామన్నది కాదు గొప్ప, ఎంత గొప్పగా జీవించామన్నదే గొప్ప అని చేయి పట్టి మరి నడిపించిన జగద్గురువులు ప్రవక్తలు. ఆది యుగం నుంచి ఆధునిక యుగం వరకు వారే మహర్షులు... ఈ పరంపరలో దైవంచే నియమించబడిన తొలి గురువు ప్రవక్త ఆదం(అ) అయితే, అంతిమ గురువు మహనీయ ముహమ్మద్ (స).

జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడు.. సమాజ బృందా వనానికి నిజమైన రక్షకుడు.. ఆయనెవరో కాదు మనందరికీ విద్యా బుద్ధులు నేర్పే గురువు. మానవత్వం పరిమళించే విద్యా కుసుమాలుగా శిష్యులను తీర్చిదిద్ది, వారు జాతికి అందిన అమూల్య వరాలుగా, ఆభరణాలుగా పరిఢవిల్లాలని మనస్సు నిండుగా యువతను దీవించే, ప్రజ్వలించే దివ్వె ఉపాధ్యాయుడు!

దైవప్రవక్త(స) ఇలా అన్నారు: అల్లాహ్ నన్ను హింసావాదిగా, నియంతగా, నిరంకుశ వాదిగా, పెత్తనం చెలాయించే వానిగా, కర్కశునిగా చేసి పంపలేదు. నిశ్చయంగా అయన నన్ను సౌమ్యునిగా, ఉపాధ్యాయునిగా, నిరాడంబరునిగా, సునిర్మల హృదయునిగా చేసి పంపించాడు. (సహీహ్ ముస్లిం)

కేవలం పుస్తకాలు ఔపోసన పట్టినంత మాత్రాన మనుషులు పండితులు కారు. దైవభీతిపరులే సిసలైన పండితులు. విద్యకొద్దీ వినయమన్నట్టుగా జ్ఞానం పెరిగిన కొలది మనిషిలో భక్తివిశ్వాసాలు పెంపొందాలి.

## మానవాళికి ఆది గురువులు ప్రవక్తలు

విప్లవ ఉద్యమాలను నడిపి మార్పు సాధించినవారు, సంస్కర్తలు ఇలా ఎందరో మనకు చరిత్ర అధ్యయనంలో కానవస్తారు. విభిన్న మత ధర్మాలను బోధించిన వారు ఉన్నారు. నైతిక ప్రమాణాలకు పెద్దపీట వేసిన వారు ఉన్నారు. కాని వారి బోధనలు, వారు సాధించిన విజయాలు, ఫలితాలు పరిశీలిస్తే అందులో సమాజ శ్రేయోశుభాలు బహు కొద్దిగా మాత్రమే కానవస్తాయి. ఏదో ఒక జీవన రంగానికి మాత్రమే ఫలితాలు పరిమితమై ఉంటాయి. ఆ ప్రయోజనాలతో పాటు కొన్ని అవాంఛనీయమైన ధోరణులు కూడా అక్కడ కనబడతాయి. మానవ చరిత్రలో మనిషి జీవితాన్ని

సంపూర్ణంగా, అన్ని రంగాల్లో సంస్కరించినవారు కేవలం ప్రవక్తలు తప్ప మరెవ్వరూ లేరు. మనిషి అంతరంగాన్ని, మనిషి బాహ్య ఆచరణను సమస్తాన్ని చక్కదిద్దినవారు ప్రవక్తలు మాత్రమే.

హజ్రత్ అబ్దుల్లాహ్‌బిన్ అమ్రూ(రజి) ఉల్లేఖనం ప్రకారం: 'ఒకసారి ముహమ్మద్ ప్రవక్త (స) మస్జిదె నబవికి వెళ్లినప్పుడు, అక్కడ రెండు బృందాలు విడివిడిగా సమావేశమయ్యాయి. ఒక బృందం దైవారాధనలో నిమగ్నమై ఉంది. రెండో బృందం నిరక్షరాస్యులకు చదువు చెప్పే పనిలో ఉంది. అది చూసి ప్రవక్త మహనీయులు, 'ఇరు బృందాలూ మంచి పని చేస్తున్నాయి. ఒక బృందంలోని సభ్యులు దైవారాధనలో ఉన్నారు. ఇది చాలా మంచిపని. అయితే దైవం తలిస్తే వారి ఆరాధన, వేడుకోళ్లు స్వీకరించవచ్చు, స్వీకరించకపోనూవచ్చు. రెండో బృంద సభ్యులు చేస్తున్న పని మొదటివారి కంటే ఇంకా ఉత్తమమైనది. ఎందుకంటే వీరు తెలియనివారికి జ్ఞానం, వివేకం, విచక్షణ తెలియచేస్తున్నారు. కనుక ఇది ఉత్తమ కార్యం. నేనూ ఉపాధ్యాయునిగా, బోధకుడిగానే పంపబడ్డాను' అని ప్రవచిస్తూ, ప్రవక్త రెండవ బృంద సభ్యులతో కూర్చున్నారు.

ఏ హృయంలోనయితే ధర్మశీలత, దైవభీతి ఉంటుందో అక్కడే ప్రవర్తనలో సౌందర్యం ఉంటుంది. మనుషుల్లో ప్రవర్తన అందంగా ఉన్నప్పుడే కుటుంబ జీవనంలో సామరస్యం ఉంటుంది. సంసారంలో సామరస్యం, సహిష్ణుతలు ఉన్నప్పుడే సమాజంలో క్రమశిక్షణ, గౌరవ భావం ఉంటుంది. సమాజంలో క్రమశిక్షణ, అందరి యెడల గౌరవ భావం ఉన్నప్పుడే దేశంలో శాంతి పరిఢవిల్లుతుంది. మరే దేశం, ప్రాంతంలోనయితే ఇవన్నీ ప్రోగవుతాయో అది అల్లాహ్ కృపానుగ్రహాలకు ఆలవాలమవుతుంది.

ఆవుని చూస్తే సృష్టిలో చులకనగా చూసే గడ్డిపరకలను తిని, సృష్టికి శ్రేష్ఠుడైన వాడిని జీవించడానికి అవసరమైన పాలను ఇస్తుంది. మనకు అవసరం లేకపోయినా అది వేరే రూపం నుండి సమాజానికి ఉపయోగపడతాయని అవు, గడ్డిని చూస్తే అవగతమవుతుంది. సృష్టిలో ఏది నిరర్థకం కాదు. ప్రతి దానిని ఒక లక్ష్యంతోనే పుట్టించాడు అల్లాహ్. అవి గగన భువనాలు కావచ్చు, గడ్డి పరకలు- దానికన్నా అల్పమైనవీ కావచ్చు. ప్రతి దానికి ఓ ప్రయోజనం తప్పకుండా ఉంటుంది, ఉంది.

శిష్యులకు సద్గురువులు చేసే బోధలు కొన్ని సందర్భాల్లో చాలా విచిత్రంగా ఉంటాయి. ఒక్కొక్కరిదీ ఒక్కో విధానం. కొందరు అనుగ్రహభాషణాలతో, మరికొందరు ఆచరణాత్మకమైన పద్ధతుల్లో బోధిస్తారు. కోపాన్ని దిగమింగాలి. దుఃఖాన్ని అధిగమించాలి. మౌనాన్ని అనుభవించాలి. నిశ్చల ధ్యాన ఫలితాన్ని అందుకోవాలి. జీవితంలో ఓ గురువు కష్టాన్ని దూరం చేస్తాడు. ఓ గురువు చిరకాల కోరిక సాధనను సులువుగా మారుస్తాడు. ఓ గురువు నైరాశ్యాన్ని ప్రారద్రోలతాడు. ఓ గురువు అపరిమిత జ్ఞానాన్ని అనుగ్రహించేస్తాడు.

హజ్రత్ అబూ ఉమామా (రజి), కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీలో అందరి కన్నా అల్పుని మీద నాకెంత విశిష్ఠత ఉందో- ఒక జ్ఞానికి మరో ఆరాధకుడి మీద అంత విశిష్ఠత ఉంటుంది. ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు: ప్రజలకు మంచిని బోధించే వారి మీద దేవుడు కారుణ్యాన్ని కురిపిస్తాడు. ఇంకా దైవదూతలు, భూమ్యాకాశాల్లో ఉన్నవారు, ఆఖరికి చీమలు తాముండే రంధ్రంలో నుండి, చేపలు (నీళ్లలో నుండి) వారి మీద దైవ కారుణ్యం వర్షించాలని ప్రార్థిస్తూ ఉంటారు. (తిర్మిజీ-హసన్)

సమాజంలో పిల్లలు అధిక మాత్రులు! వీరి ప్రతిభ, సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి ఉపాధ్యాయుడు 'వజ్రాన్ని సాన బెట్టే ఒక సాధనం' కావాలి! మారుతున్న పరిస్థితుల కనుగుణంగా, తగిన నూతన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో, తాను నిరంతర విద్యార్థిగా ఉంటూ, సృజనాత్మక పద్ధతులతో యువతకు మార్గదర్శనం చేస్తూ, దేశ భవితను తీర్చి దిద్దాల్సిన గురువు బాధ్యత నేడు మరింత బృహత్తరమైనదని చెప్పక తప్పదు. విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మవిశ్వాసానికి స్వావలంబనకు నెలవు అనే విషయం గుర్తుంచుకోవాలి. ఉత్తమ గురువులు ఉన్నత భావాలు గల శిష్యులనే కాదు, చుట్టూ ఉండే సమాజాన్ని ఉత్కృష్టంగా నిర్మించగలిగిన నాడే జాతి జీవనం మహోన్నతంగా సాగుతుంది.

## భయాలను తొలగించాలి. ఉత్తములుగా మార్చాలి

ఎవరు ఔనన్నా, కాదన్నా ఒక్కటి మాత్రం వాస్తవం. గతంలో గురువులకు సమాజంలో దక్కిన గౌరవ మర్యాదలు ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లకు దక్కడం లేదు. ఇది కొంతమందికి చేదుగా అనిపించవచ్చేమో కానీ, కళ్ళముందు కనిపిస్తున్న వాస్తవం ఇదే. ఈ పరిస్థితి పూర్తిగా మారాలి. విధి నిర్వహణలో ఉపాధ్యాయుల్లో అంకితభావం మరింత పెరగాల్సి ఉంది. కేవలం నైన్ టు ఫైవ్ పనిచేస్తే సరిపోదు. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత గురువుదే. సకాలంలో సిలబస్ పూర్తి చేయడం, పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధపరచడం, మంచి రిజల్ట్స్ సాధించడం గురువుల బాధ్యతల్లో ఒకటి మాత్రమే. కానీ, ప్రస్తుతం అవే సర్వస్వంగా మారిపోవడం

దురదృష్టకరం. ఒక రకంగా ఉపాధ్యాయుడి బాధ్యతలను కుదించడమే ఇది. పరీక్షల్లో  మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వాల్సిందే. కానీ, విద్యతోపాటు చాలా అంశాలపై ముఖ్యంగా, భావి జీవితంలో విద్యార్థులు ఎదుర్కొబోయే సవాళ్ళను చెప్పి, అందుకు వారిని సన్నద్ధం చేయడం కూడా గురువుల బాధ్యతే. చిన్నచిన్న విషయాలకే కొందరు విద్యార్థులు విపరీతంగా ప్రవర్తిస్తున్నారు. పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో అనే భయంతో విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్న బాధాకరమైన ఇన్సిడెంట్లను చూస్తున్నాం. ఇలాంటి విపరీత చర్యలకు పాల్పడకుండా ఉపాధ్యాయులే పిల్లల్ని మానసికంగా సిద్ధం చేయాలి. సమస్యను, సవాళ్ళను ఎదుర్కొనే దృఢ సంకల్పం విద్యార్థుల్లో అలవడేలా గురువులే చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులను, వారి ఆర్థిక పరిస్థితిని, సమాజాన్ని అర్థం చేసుకునే రీతిలో విద్యార్థులకు తర్ఫీదునివ్వాలి. పెద్దయ్యాక ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో పిల్లలకు సరైన శిక్షణ ఇవ్వాలి. కేవలం టీచర్లతో మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ఇది జరిగినప్పుడు ఉపాధ్యాయుల పేరు, ప్రతిష్టలు ఇనుమడిస్తాయి.

గురువు నిర్మలుడై, శాంతస్వభావం కలిగి, సాధన సంపత్తి కలిగి, మితభాషిగా ఉండాలి. కామ క్రోధాలను వదిలిన వారై  ఉండాలి. సదాచార ప్రవర్తకులై, జితేంద్రియులై ఉండాలి. అంతేకాదు, ధర్మ శాస్త్రం ఎంత తెలుసో, సంప్రదాయమూ అంతే తెలిసిన వారే ఉత్తమ గురువులు అని చెబుతారు పెద్దలు. ఎందరో విద్యార్థులకు మార్గదర్శిగా ఉండే గురువు అంతరంగంలో, బాహ్యంలో శుచిత్వం కలిగి ఉండాలి. అలాంటి ఉపాధ్యాయుడే ఆదర్శవంతుడు అవుతాడు. శిష్యులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దగలుగుతాడు. శిష్యులను ప్రోత్సహించడం మాత్రమే కాదు, వారి లోపాలను గుర్తించి వాటిని అధిగమించే అవకాశాలూ కల్పిస్తాడు. శిక్షణ ఇవ్వడం మాత్రమే అవసరమైతే తానే స్వయంగా పూనుకొని శిష్యుడిని ఉద్ధరిస్తాడు. జిజ్ఞాసులై శిష్యునికి సమర్థుడైన గురువు, అలాగే సమర్థుడైన గురువు కు యోగ్యుడైన శిష్యుడు లభించడం ఒక అదృష్టమ్.  వ్యక్తి పట్టుదలకు, సాధించాలనే తపనకు గురువు మార్గదర్శకం  తోడైతే, ఆ వ్యక్తి ఉత్తమ స్థాయికి చేరగలడు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రవక్త ముహమ్మద్(స) జీవిత లక్ష్యం కూడా ఇదే. ఆయన సందేశం మనిషి జీవితాన్ని, సామాజిక జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సంపూర్ణంగా మార్చివేసింది. మనిషి అంతరంగంలో మార్పు సాధించింది. ఆరాధనా స్థలమైన మస్జిదు మొదలు ఆర్థిక కార్యకలాపాలు కొనసాగే మార్కెట్టు వరకు, పాఠశాల నుంచి న్యాయస్థానం వరకు ఇంటి నుంచి యుద్ధరంగం వరకు అన్ని చోట్ల పాపభీతి, దైవభక్తి అలుముకున్నాయి. ప్రజల ఆలోచన విధానం మారింది. భావాలు మారాయి. భావావేశాల్లో మార్పు వచ్చింది. దృక్కోణం మారింది. అలవాట్లు మారాయి. ఆచరణలు మారాయి,  ఆచారాలు, సంప్రదాయాలు మారిపోయాయి. హక్కులు, బాధ్యతల తీరుతెన్ను మార్పుకు గురయ్యాయి. మంచి, చెడు ప్రమాణాలు, ధర్మ బద్ధం, ధర్మ నిషిద్ధం అన్న కొలమానాలు మారిపోయాయి. నైతిక విలువలు, సంవిధాన సూత్రాలు, శాసనాలు, యుద్ధ నియమాలు, శాంతి విధానాలు అన్నీ మారిపోయాయి. ఉపాధి మార్గాలు, దాంపత్య నియమాలు అన్నీ మారిపోయాయి. నాగరికత, సామాజిక జీవనాలకు సంబంధించిన సమస్త రంగాలు విప్లవాత్మక మార్పుకు గురయ్యాయి. జీవన రంగాన్నింటిని అలుముకున్న మార్పు ఇది.

ఈ మార్పులో ప్రతిచోట మనకు శ్రేయోశుభాలే కనబడతాయి. ఈ మార్పులో ఎక్కడా చెడు మచ్చుకు కూడా కనబడదు. ఎక్కడా హాని అగుపడదు. ఎక్కడా విచ్ఛిన్నం లేదు. అన్ని వైపులా నిర్మాణమే. ఎటు చూసినా ప్రగతి వికాసాలే. నిజం చెప్పాలంటే మానవాళికి మార్గదర్శి అయిన ప్రవక్త ముహమ్మద్ (స) వల్ల మానవాళికి ఒక కొత్త ఉదయం ప్రాప్తమయ్యింది. విశ్వజనీన సోదర భావానికి పునాదులు పడ్డాయి. చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమయ్యింది. ఆయన సాధించిన ఈ మహత్కార్యం చరిత్రలో సాటిలేనిది.

అజ్ఞాన, అంధకారంలో కూరుకుపోయిన నాటి సమాజంలో ముహమ్మద్(స) జ్ఞానజ్యోతులు వెలిగించారు. విద్యా కుసుమాలను వికసింపజేశారు. విద్యార్జన ప్రతి ఒక్కరి విధి అని ఆయన నిర్దేశించారు. 'జ్ఞానం జీవితం, అజ్ఞానం మరణం' అని విశదీకరించారు.

విద్యావిజ్ఞానాలు మనిషిని ఇహపరలోకాల్లో ఉన్నత స్థానాలకు, సాఫల్య శిఖరాలకు చేరిస్తే, అజ్ఞానం, అవిద్య అతడిని అధః

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

పాతాళంలో కూరుకుపోయేలా చేస్తాయి. అందుకే ముహమ్మద్ ప్రవక్త (స) విద్యావిజ్ఞానాలకు పెద్దపీట వేశారు. వయోభేదం కాని, వర్గభేదం కాని, స్త్రీపురుషులన్న లింగభేదం కాని లేకుండా అన్ని వయసులవారు, అన్నివర్గాలవారు, వర్ణాలవారు, స్త్రీలు, పురుషులు అందరూ విధిగా విద్యార్జన చేయాలని నిర్దేశించారు. 'విద్య' అంటే కేవలం డిగ్రీలు సంపాదించడం మాత్రమే కాదు. విద్య విజ్ఞానాన్ని నేర్పాలి.

మన జీవితంలో గురువు ప్రాముఖ్యత చాలా ఉంటుంది. ఏ వ్యక్తి పుడుతూనే నిష్ణాతుడు కాదు. ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరి వద్ద విద్యాభ్యాసం చేసిన పిమ్మటనే అతను తనకు నచ్చిన అంశములో నైపుణ్యతను పెంపొందించుకోగలడు. ఒకవ్యక్తి పరిపూర్ణమైన జానం సంపాదించుకోవడంలో గురువు ప్రభావం చాలా ఉంటుంది.

చదువు మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుంది. ఒక విద్యార్థి పాఠశాలకు వెళ్లాడంటే ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంటాడని అర్థం. అందుకే చాలామంది తల్లిదండ్రులు ఫీజులు భారమైనా తమ పిల్లలకు మంచి విద్యను అందించాలని ఉత్తమ పాఠశాలల్ని ఎంచుకుంటారు. అయితే ఇక్కడ పిల్లలకు మార్కులు, ర్యాంకులు మాత్రమే ముఖ్యం కాదు.. వారికి కొన్ని కనీస మర్యాదలు నేర్పించడం అత్యవసరమని చెబుతున్నారు నిపుణులు. దీనివల్ల వారికి మంచి విద్యతో పాటు సత్ప్రవర్తన కూడా అలవడుతుంది.

గురువు అంటే కేవలం చదువు నేర్పిన వారే కాదని, మనకు జీవితానికి అవసరమైన అనేక అంశాలను నేర్పిన ప్రతి ఒక్కరినీ గురువుగానే భావించాలి, మాట్లాడ్డం దగ్గర్నుంచి పోట్లాడ్డం వరకూ అంతా సమాజం నుంచే నేర్చుకుంటున్నాము. తల్లిదండ్రుల అనురాగం గారంగా మారితే బిడ్డ భవిష్యత్ పాడవుతుందని, కానీ గురువు పెంచుకునే అనురాగం వారిని వృద్ధిలోకి తీసుకు వస్తుంది, గురువు దృష్టిలో రాజు కొడుకైనా, సేవకుడి కొడుకైనా, రైతు కొడుకైనా, రౌతు కుమార్తె అయినా సమానులే అని, విద్య నేర్పిన గురువుల పట్ల జీవితమంతా కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండటంతో పాటు, గురువు గొప్పతనాన్ని లోకానికి తెలియజెప్పే రీతిలో ప్రవర్తించాలలి.

## శిష్యరిక విశిష్టత

తెలిసినవారూ, తెలియనివారూ ఇరువురూ సమానులు కాగలరా? (జుమర్ : 9)

మీలో విశ్వసించినవారికి, జ్ఞానం ప్రసాదించ బడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. (ముజాదలహ్: 11)

అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు. (ఫాతిర్: 28)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: (ధర్మ) జ్ఞానాన్ని ఆర్జించటం కోసం ఎవరయినా ఒక దారిన పడితే దేవుడు ఆ దారి గుండా అతని కోసం స్వర్గమార్గాన్ని సుగమం చేస్తాడు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: ఆదం పుత్రుడు (మనిషి) చనిపోగానే అతని కర్మల పరంపర అంతటితో ఆగిపోతుంది. అయితే మూడు కర్మల పుణ్యం మాత్రం అతనికి (ఆ తర్వాత కూడా) లభిస్తూనే ఉంటుంది. ఆ మూడు ఇవి: (1) శాశ్వతంగా ఉండిపోయే దానం (సదఖయె జారియా), (2) తన తదనంతరం ప్రజలకు ఉపయోగపడే విద్య (3) తన శ్రేయస్సు కోసం ప్రార్థించే సదాచార సంపన్నులయిన సంతానం. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: జ్ఞానార్జనా ధ్యేయంతో బయలుదేరిన వ్యక్తి తిరిగొచ్చేవరకు దైవమార్గంలో ఉన్నట్లుగానే పరిగణించబడతాడు. (తిర్మిజీ-హసన్) (సుననె తిర్మిజీలోని విద్యా అధ్యాయం)

విద్య ప్రాముఖ్యతను గురించి చెబుతూ ముహమ్మద్(స), షైతాన్ వెయ్యి మంది భక్తులను బురిడీ కొట్టించగలడేమో కాని, ఒక్క పండితుడి (జ్ఞాని)ని బోల్తా కొట్టించడం వాడి వల్ల కాదు' అని ప్రవచించారు. 'రాత్రివేళ ఒక గంట సమయాన్ని విద్యా సంబంధమైన చర్చల కోసం కేటాయించడం, ఆ రాత్రంతా (తెల్లవారేవరకు) దైవారాధన చేసిన దానితో సమానం' అన్నారాయన.

## విద్యార్థి మర్యాదలు

ఉపాధ్యాయుల పట్ల ఒకప్పుడు ఉండే గౌరవ మర్యాదలు క్రమ క్రమంగా తగ్గిపోతున్నాయి. తోటి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే కొందరు యువకులు.. అంతటితో ఆగకుండా ఏకంగా టీచర్లను కూడా టార్గెట్ చేస్తుంటారు. ఇలాంటి ఘటనలు రోజూ ఎక్కడో చోట జరుగుతూనే ఉంటాయి. ఈ క్రమంలో శిష్యులు తప్పక పాటించాల్సిన కొన్ని మర్యాదల గురించి తెలుసుకుందాం!

### మొదటిది : సహనం

జ్ఞానాన్ని ఆర్జించడం మహోన్నత విషయం. అది అవిరళ కృషి నిరంతర శ్రమ అనే వంతెన ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. జ్ఞానాన్ని ఆర్జించే విద్యార్థి చాలా ఓపిక, సహన గుణం, ఓర్మి, కూర్మి కలిగి ఉండాలి.

### రెండవది: చిత్తశుద్ధి

విద్యార్జన విషయంలో నిజాయితీగా ఉండాలి. దైవ ప్రసన్నత,

పరలోక మోక్షం పరమావధిగా ఉండాలి. మిడిసిపాటు, పదవీ వ్యామోహం, ఐహిక లాలస విద్యార్జన లక్ష్యమయి ఉండకూడదు.

దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు, పండితులతో పోటీ పడటానికి, లేదా మూర్ఖులతో వాదోపవాదాలు జరపడానికి లేదా ప్రజల మన్ననలు పొంది వారిని తన వైపు తిప్పుకోవడానికి ఎవరైనా జ్ఞానాన్ని నేర్చుకుంటే, అల్లాహ్ అతనిని నరకంలో ప్రవేశపెడతాడు. (నసాయీ)

**మూడవది: జ్ఞానానికనుగుణంగా ఆచరించడం**

జ్ఞానానికనుగుణంగా పని చేయడం అసలు జ్ఞాన ఫలమని తెలుసుకోండి, కాబట్టి తెలిసి కూడా ఆచరించనివాడు యూదులను పోలి ఉంటాడు. జ్ఞానం లేకుండా అమలు చేసే వారు వారు క్రైస్తవులను పోలి ఉంటారు.

తౌరాత్ (ఆజ్ఞలు పాటించే) బాధ్యత మోపబడినవారు ఆ బాధ్యత నిర్వహించలేదు. వారిని పుస్తకాలుమోసే గాడిదతో పోల్చవచ్చు. (తౌరాత్ జ్ఞానం తెలిసి కూడా అంధులై) అల్లాహ్ సూక్తుల్ని నిరాకరించినవారు అంతకంటే దిగజారిపోయారు. ఇలాంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు. (జుమా: 5)

**నాల్గవది : శాశ్వత పర్యవేక్షణ**

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనల్ని సదా గమనిస్తూనే ఉన్నాడు. మనం పది మందితో ఉన్నా, ఒంటరిగా ఉన్నా మనం అయన యెడల భక్తి భావం కలిగి ఉండాలి. అల్లాహ్ యెడల భయం, ఆశల మధ్య మన జీవితమా సాగాలి. ఎందుకంటే పక్షి రెండు రెక్కల ఎలాంటివో ఒక ముస్లింకు అల్లాహ్ యెడల ఆశాభయాలు అలాంటివే.

**ఐదవది : సమయపాలన**

**ఆరవది : అనవసర విషయాల జోలికి వేళ్ళకూడదు.**

**ఏడవది : స్వీయ నియంత్రణ, నైపుణ్యం, కార్యదీక్ష**

**ఎనిమిదవది : పుస్తక పఠనం**

**తొమ్మిదవది : మంచి సహచరుడిని ఎంచుకోవడం**

**పదవది : గురువుతో మర్యాదగా ఉండండి.**

ఒక్క మాటలో చెప్పాలంటే - గురువులకు శిష్యులంటే ప్రేమ, అనురాగం, ఆప్యాయత ఉండాలి. శిష్యులకు గురువులంటే గౌరవం, విధేయత, వినయం, మర్యాద ఉండాలి.

## నేరం ఎవరిది?

ఆశ్రయం ఇచ్చిన నేల
తరతరాలుగా రక్తసిక్తం
జాలి తలచిన గుండె
నేడు ఉగ్రవాది అనే
అపనింద మోస్తుంది
మానవత్వానికి మూల్యం
సమస్తం పోగొట్టుకోవడం
బిడ్డను పోగొట్టుకున్న అమ్మ
ఆ కడుపుకోతకు కారణం
ఎవరు?
అమ్మా నాన్నల శవాలపై
బెదురు చూపులతో చిన్నారులు
ఆ అనాథలకు దిక్కెవరు?
శిథిలాల కింద సమాధులైన
అమాయకుల ఆక్రందనలు
సామ్రాజ్యవాదులకు
వినబడతాయా?
మాతృభూమి కై పోరాడుతున్న
దేశభక్తుల వీరత్వం
కాబోదులైనా ఫాసిస్టు శక్తులకు
కనిపిస్తుందా?
గాజా బాంబుల మోతతో
మరు భూమిని తలపిస్తుంది
ఈ దారుణాలన్నీ
జాలి,మానవత్వం చచ్చిన
దానవులకు బోధపడుతుందా?
పాలస్తీనా మూలవాసులు
దుష్ట,దౌర్జన్యాలకు
సమిధలు అవుతుంటే
ధనబలం,అంగబలం
అన్నీ అమాయకులను
పొట్టన పెట్టుకుంటుంటే
దయ లేని మానవుడు
మృగమై,రాక్షసుడై
రుధిర ధారలు
పారిస్తుంటే
న్యాయం,నా దేశం,
అంటూ నినదించడమే
నేరమా?
పాపమా?
అంతం కాని ఘోర కలి
దైవమా.....
నీవే చూపాలి దారి.

**- ఖుర్షీద్ బేగం**



# నవాబ్ అలీ ముహమ్మద్ ఖాన్ (-1859)

20




**ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో** ఆంగ్లేయ సైన్యాధికారులకు ముచ్చెమటలు పట్టించిన అవధ్ రాజమాత బేగం హజరత్ మహల్ సాగించిన పోరాటంలో ఆమె కుడిభుజంగా నిలిచారు నవాబ్ అలీ ముహమ్మద్ ఖాన్. చరిత్రకారులు, సమకాలీనులు ఆయనను 'మమ్మూఖాన్' అని పిలిచేవారు. 1856 ఫిబ్రవరి 13న అవధ్ నవాబు వాజిద్ అలీ షాను ఆంగ్లేయులు నిర్బంధించి, మార్చి 13న కలకత్తా పంపి రాజధాని లక్నోను అక్రమంగా ఆక్రమించుకున్నప్పుడు ఆరంభమైన అవధ్ పోరాటానికి మమ్మూఖాన్ తగిన వ్యూహాన్ని రూపొందించి బేగం హజరత్ మహల్‌కు అండదండలు అందించారు. 1857 మే 31న లక్నో ఛావనీలో బేగం హజరత్ మహల్ నాయకత్వాన స్వదేశీ యోధులు, ప్రజలు సమావేశమై స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుని జూన్ మాసం నాటికి ఆంగ్లేయుల అధికారం ఆనవాళ్ళు అవధ్ రాజ్యంలో కనుమరుగు చేసిన చారిత్రక ఘట్టంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. 1857 జూలై 7న బేగం హజరత్ మహల్ తన బిడ్డ బిర్జిస్ ఖదీర్‌ను అవధ్ నవాబుగా ప్రకటించి, లక్షా ఎనభైవేల సైనికులను సమకూర్చి, లక్షలాది రూపాయలను వ్యయంచేసి లక్నో కోటను పునర్నిర్మించే బృహత్తర కార్యక్రమంలో నవాబ్ అలీ మొహమ్మద్ ఖాన్ ఆమెకు సహాయ సహకారాలు అందించారు. అవధ్ రాజ్యపాలన కోసం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీలో ఆయన న్యాయ విభాగం అధినేతగా బాధ్యతలు చేపట్టారు. బేగం హజరత్ మహల్‌కు అత్యంత విశ్వాసపాత్రుడిగా, ఆమె బిడ్డ బిర్జిస్ ఖదీర్ భద్రతకు నవాబ్ అలీ ముహమ్మద్ ఖాన్ తన సర్వం పణంగా పెట్టి రక్షకుడిగా నిలిచారు. అవధ్ పోరాటాన్ని బలోపేతం చేసేందుకు సాగిన ప్రయత్నాలలో భాగంగా పోరాటయోధుడు మౌల్వీ అహమ్మదుల్లా షాహ్ ఫైజాబాదీని రప్పించి అవధ్‌పోరాటంలో భాగం చేయడానికి బేగం హజరత్ మహల్ ప్రయత్నాలను విజయవంతం చేయడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. బేగం ప్రతినిధిగా విజయవంతంగా చర్చలు నిర్వహించారు. ఆ తరువాతి కాలంలో అవధ్ పోరాటం, రాజ్యపాలన తీరు తెన్నుల విషయంలో స్వతంత్ర అవధ్ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న ఆయనకు, మౌల్వీ అహ్మదుల్లా షాహ్ మధ్యన అభిప్రాయభేదాలు తలెత్తాయి. ఈ బలహీనతలు ఎలా ఉన్నా, ప్రత్యర్థులు ఎలాంటి విమర్శలు చేసినా లెక్కచెయ్యక నవాబ్ అలీ ముహమ్మద్ ఖాన్ మాత్రం పోరుబాట వీడలేదు, బేగం హజరత్ మహల్‌ను విడనాడ లేదు. బ్రిటిష్ బలగాలతో ఢీ అంటే ఢీ అంటూ బేగం హజరత్ మహల్ సాగించిన నాలుగు పోరాటాలలోనూ ఆయన ఆమె వెన్నంటి నిలిచారు. పది మాసాల పాటు ప్రత్యక్ష పాలన చేసి ప్రజలను, ఇతర స్వదేశీ పాలకులను ఉత్తేజితుల్ని చేసిన బేగం పాలనలో ఆయన ప్రధాన న్యాయమూర్తిగా తనదైన భాగస్వామ్యం వహించారు. 1859 మార్చిలో ఆంగ్ల సైన్యాధికారులు లక్నోను భారీ బలగాలతో, యుద్ధ సామగ్రితో అన్నివైపుల నుండి చుట్టుముట్టారు. ఇరు పక్షాల మధ్యన భయంకర యుద్ధం సాగింది. పరాజయం తప్పని పరిస్థితులలో సహచరుల ఒత్తిడి మేరకు బేగం హజరత్ మహల్‌తో కలసి నవాబ్ అలీ మొహమ్మద్ ఖాన్ నేపాల్ అడవుల్లోకి తప్పుకున్నారు. చివరకు బేగం హజరత్ మహల్‌తో కూడా విభేదాలు వచ్చిన నేపథ్యంలో ఆయన కంపెనీ సైన్యాధికారుల నిర్బంధంలో చిక్కుకున్నారు. ఆంగ్లేయాధికారులు విచారణ తంతు నడిపి అవధ్ పోరాట యోధుడు నవాబ్ అలీ ముహమ్మద్ ఖాన్‌కు జీవితకాల శిక్షను విధించి 1859 చివర్లో అండమాను జైలుకు తరలించారు. ✤



9440241727

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త సయ్యిద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**



- నసీరా బేగం

# స్నేహం కూడా దైవానుగ్రహమే

**మనిషి** సంఘ జీవి. అతనికి సంఘంలో ఎంతో మందితో, ఏదో ఒక విధమైన సంబంధం ఏర్పడుతుంది. ఆ సంబంధం కొంత సమయం కోసమో, కొన్ని రోజుల కోసమో లేదా కొన్ని సంవత్సరాల కోసమో ఉంటుంది. ఈ సంబంధాల విషయానికొస్తే కొన్ని సంబంధాలు రక్త సంబంధంతో ముడివడి ఉంటాయి. ఇవైతే మనిషి ఉనికి ప్రారంభమైనప్పటి నుంచే ఏర్పడిపోతాయి. అవి ఎట్టి పరిస్థితిలోను దూరమవ్వనివి, తెగిపోనివి. మరికొన్ని సంబంధాలు అతను ఎక్కడుంటే అక్కడ ఏర్పడేది. అవి స్నేహ సంబంధాలు స్నేహం అనేది మనిషి నైజంలోనే అంతర్లీనమై ఉంది. కనుకనే మనం చూస్తూఉంటాము. మాటలు రాని పసి పిల్లలు కూడా తన వయసు పిల్లలను చూసి ఆకర్షితులవుతారు. వారితో స్నేహం చేయటానికి ముందుంజ వేస్తారు. వారితో కలసి ఆడుకోవటానికి ఇష్టపడతారు. వారి నుంచి వేరు చెయ్యటానికి కృషి చేసినప్పుడు ఏడుస్తారు. దీని అర్థం ఏమిటంటే మనిషికి రక్త సంబంధీకులు ఎంతమంది ఉన్నప్పటికీ అతనికి స్నేహితులు కూడా కావలసి ఉంటుంది. కనుక మనిషి తన చుట్టూ స్నేహితులను ఏర్పరచుకుంటాడు.

స్నేహం కూడా అల్లాహ్ తరపు నుండి ఒక పెద్ద అనుగ్రహమే. స్నేహితులు లేనట్లయితే మనిషి నడి సముద్రంలో ఒంటరిగా, ఏకాకిగా మిగిలిపోయినట్లు భావిస్తాడు. అతనికి తన జీవన ప్రయాణం రుచి లేనిదిగా, అసంతోషమైనదిగా అనిపిస్తుంది. దీని కారణంగా అతనికి తన చుట్టూ ఉన్న ప్రజలతో స్నేహం చెయ్యటం తప్పనిసరి అయిపోతుంది. స్నేహం లేకుండా అతను ఏ పనీ సక్రమంగా నిర్వహించలేడు. ఈ విధంగా అతనికి ఎంతోమందితో స్నేహ సంబంధాలు ఏర్పడతాయి. కాని వారందరూ అతనికి స్నేహితులు కావచ్చు కాని అసలైన, సన్నిహితులైన స్నేహితులు ఒకరో, ఇద్దరో ఉంటారు.

స్నేహితులు ఉండటం అల్లాహ్ అనుగ్రహమే. కాని ఆ స్నేహితులను ఎన్నుకోవటంలో మనిషి అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. ఎందుకంటే మనిషి అతని స్నేహితుని ధర్మంపైనే ఉంటాడు. అంటే అతని ప్రభావానికి గురి అవుతాడు. అతని అడుగు జాడలలోనే అనుకరిస్తాడు. అతని అలవాట్లకు ప్రభావితుడవుతాడు. దీనికారణంగా మంచి స్నేహితుడే దైవానుగ్రహం. మనిషిని ఎవడిని బడితే అతనిని స్నేహితుడిగా చేసుకుని అతను దైవానుగ్రహం అనుకోకూడదు. చెడ్డ స్నేహితుడు చెడులవైపు ఆహ్వానిస్తాడు. మంచి స్నేహితుడు మంచి వైపునకు ఆహ్వానిస్తాడు. చెడ్డ స్నేహితుడు అతనిని అనుకరించని కారణంగా, సహకరించని కారణంగా శత్రుత్వాన్ని పెంచుకుంటాడు. కక్షను సాధిస్తాడు. మంచి స్నేహితుడు మంచిని అనుకరించిన కారణంగా ప్రేమిస్తాడు, అతనికి దిశా నిర్దేశనం చేస్తాడు. చెయ్యి పట్టుకుని నడిపిస్తాడు. కష్టసుఖాలలో పాలుపంచుకుంటాడు. సుదీర్ఘ కాలం

వరకు, చివరి అంచుల వరకు అతనికి తోడునీడగా ఉంటాడు. కనుకనే మంచి స్నేహం కూడా దైవానుగ్రహమే అని చెప్పబడింది.

అయితే చరిత్రను విశ్లేషిస్తే మంచి స్నేహితులు దైవప్రవక్తల స్నేహితులు. వారే మనకు ఆదర్శనీయులు. అయితే వారి స్నేహం కేవలం అల్లాహ్ కోసమే ఉండేది. కనుకనే అల్లాహ్‌వారి స్నేహంలో శుభాలు ఎంతగా చేర్చాడంటే వారు ప్రాణ స్నేహితులైపోయారు. వారు తమ ప్రవక్త కోసం అన్నిటిని ధారపోశారు. చివరకు ప్రాణాలను అర్పించటానికి సైతం సిద్ధంగా ఉన్నారు. వారి ఈ స్నేహ ప్రయాణంలో ఎన్నో త్యాగాలు చెయ్యవలసి వచ్చినా ఏనాడూ రవ్వంత కూడా వెనుకంజ వెయ్యలేదు.

దైవప్రవక్త ముహమ్మద్(స) గారిని హజ్రత్ అబూబకర్(ర) అత్యధికంగా, అంటే తన ప్రాణం, తన సర్వస్వం కంటే ఎక్కువగా ప్రేమించేవారు. ఆయనకు దైవప్రవక్త(స) గారితో ఉన్న ప్రేమను మనం దేనితోను తూయలేము. కొలువలేము. హజ్రత్ అబూ బక్ర్(రజి) దైవప్రవక్త(స) గారితో అడుగడుగునా తోడుగా ఉండే వారు. తన ప్రియ పుత్రికను దైవప్రవక్త(స) గారితో వివాహం జరిపించి తన స్నేహాన్ని మరింత బలపరుచుకున్నారు. చివరకు ఆయన(ర) దైవప్రవక్త(స) మక్కా నగరం నుంచి మదీనా పట్టణానికి వలసపోతున్నప్పుడు కూడా ఆ కఠిన ప్రయాణంలో కూడా ఆయన ఒక్కరే తోడుగా ఉన్నారు. హజ్రత్ అబూబకర్(ర) ఆ ప్రయాణంలో దైవప్రవక్త(స) గారికి ఒకసారి ఎడమ వైపు ఉండేవారు. మరొకసారి కుడివైపు ఉండేవారు. ఒకసారి ముందుండే వారు. మరొకసారి వెనుక ఉండేవారు. ఇది చూసిన దైవప్రవక్త(స) అలా ఎందుకు చేస్తున్నారని అడిగారు. దైవప్రవక్తా(స)! నాకు మీ కుడివైపు నుండి శత్రువు దాడి చేస్తాడేమో అని అనిపించి నప్పుడు నేను మీ కుడివైపు వచ్చేస్తున్నాను. అలాగే ఎప్పుడైనా ముందు నుంచి శత్రువు దాడి చేస్తాడేమో అని అనిపించినప్పుడు ముందు వైపు వస్తున్నారు. మీ వెనుక నుంచి దాడి చేస్తాడేమో అని అనిపించినప్పుడు మీ వెనుక వైపు వచ్చేస్తున్నాను. అంతే అని వివరించారు. ఆహా! ఇది ఏమి స్నేహం. దీపం చుట్టూ దీపపు పురుగు ప్రదక్షిణం చేసినట్టు. తన ప్రాణాన్ని కూడా ఖాతరు చెయ్యకుండా.

అంతేకాదు, ఆయన(స) ఈ వలస ప్రయాణంలోనే సౌర్ గుహలో తలదాచుకున్నప్పుడు దైవప్రవక్త(స)ను హజ్రత్ అబూబకర్(ర) బయటనే ఆపి స్వయంగా లోపలకు వెళ్ళి అక్కడి ప్రాంతాన్ని శుభ్రపరిచి, అందులో ఉన్న కొన్ని రంధ్రాలను గుడ్డతో పూడ్చారు. ఆ తరువాత దైవప్రవక్త(స) గారిని లోపలకు ఆహ్వానించారు. ఆ రంధ్రాలలోని ఒక రంధ్రం పూడ్చటానికి ఏమీ లేకుండా పోయింది. ఆయన(స) అబూబకర్ (ర) గారి తొడపై తన శిరస్సును ఉంచి విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు అబూబక్ర్(ర) తన కాలిబొటన వ్రేలుతో ఆ రంధ్రాన్ని కప్పారు. కాని యాదృచ్ఛికంగా ఆ రంధ్రంలో తేలు ఉంది. అది ఆయన బొటనవ్రేలును కుట్టింది. కాని ఆయన అక్కడినుంచి కాలు తీయలేదు. అది బయటికి వచ్చి దైవప్రవక్త (స)కు హాని కలుగజేస్తుందేమోనని. ఆ తేలు ఆయన్ని ఎన్నోసార్లు కుట్టింది. బాధ అధికమైంది. ఆయన దైవప్రవక్త(స) విశ్రాంతిలో భంగం కలుగుతుందని ఆయన్ని మేల్కొలపలేదు. బాధతో ఆయన కళ్ళనుంచి కన్నీళ్ళు ప్రవహించి ఆయన(స) గారి పవిత్ర ముఖంపై రాలాయి. దానికి దైవప్రవక్త(స)కు మెళకువ వచ్చింది. వెంటనే ఆయన(స) మేల్కొన్నారు.

హజ్రత్ అబూబకర్(ర) ఈ ప్రాణ స్నేహం కారణంగానే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; నేను ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్కరి ఉపకారపు హక్కును నెరవేర్చగలిగాను కాని హజ్రత్ అబూ బకర్(ర) గారి ఉపకారపు హక్కును అల్లాహ్ మాత్రమే నెరవేర్చగలడు.

హజ్రత్ అబూబకర్(ర) గారితోపాటు హజ్రత్ ఉమర్(ర), హజ్రత్ ఉస్మాన్(ర), హజ్రత్ అలీ(ర) గార్లు కూడా ఇంకా అనుచరులు ఎంతోమంది ఆయన(స)కు సర్వస్వం కంటే, ప్రాణం కంటే అధికంగా ప్రేమించేవారు.

స్నేహం అనేది చాలా అందమైన, అపురూపమైన, అనుభూతి పరమైన పవిత్రమైన సంబంధం. ఈ సంబంధం చిన్న, పెద్దా, పేద, ధనికా, ఎరుపు, నలుపు అనే తారతమ్యాలను చూడదు. కేవలం ఇద్దరి భావనలు చూస్తుంది. ఇద్దరి మార్గాలను చూస్తుంది. అంతే ఆ తరువాత అది పెనవేసుకుపోతుంది. మంచిని మంచి, చెడును చెడు అనే వ్యత్యాసాన్ని విడమర్చి చెప్పేవాడే స్నేహితుడు. చెడు వైపు పోతున్నప్పుడు చెయ్యి పట్టి లాగి నిలిపే వాడే స్నేహితుడు. కష్టాలలో అడ్డుపడిన వాడే స్నేహితుడు. సత్కార్యాలలో చెయ్యి పట్టుకుని తనకంటే ముందు నడిపేవాడే స్నేహితుడు. కనుక స్నేహం చేసేటప్పుడు తస్మాత్ జాగ్రత్త! ఇస్లామ్ ధర్మం స్నేహం గురించి బోధించే మరొక విషయం ఏమిటంటే, స్త్రీలు స్త్రీలతోను, పురుషులు పురుషులతోను స్నేహం చెయ్యాలి. స్నేహంలో హద్దులు మీరకూడదు. స్నేహంలో భార్యాపిల్లల్ని ఇతర కుటుంబసభ్యుల హక్కులను నెరవేర్చకుండా ఉండకూడదు. స్నేహం స్నేహమే- కుటుంబ సభ్యులు కుటుంబ సభ్యులే.




## మైనారిటీలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్

దసరా తర్వాత తెలంగాణ కాంగ్రెసుపార్టీ మైనారిటీ డిక్లరేషన్ విడుదల చేసే అవకాశాలున్నాయి. త్వరలో తెలంగాణలో ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిక్లరేషన్ డ్రాఫ్ట్ కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జఫర్ జావీద్ డ్రాఫ్ట్ కమిటీకి కన్వీనర్‌గా ఉన్నారు. ముస్లిము, క్రయిస్తవ సముదాయాల నుంచి సలహాలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. మైనారిటీ సముదాయాల సమస్యల పరిష్కారానికి పటిష్టమైన పథకంతో ముందుకు వస్తామని చెప్పారు. వివిధ సంఘాలు, సంస్థల నుంచి ఇప్పటికే అనేక సూచనలు వచ్చాయని, అనేక పథకాలు ప్రతిపాదించబడ్డాయని, వీటిని మేనిఫెస్టోలో చేర్చాలనే డిమాండ్లు కూడా వచ్చాయని తెలుస్తోంది. కాంగ్రెసుపార్టీ ముస్లిం నాయకులు, మైనారిటీ మతపెద్దలతో ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ సంస్థలు, సంఘాల మద్దతు రానున్న ఎన్నికల్లో సంపాదించడానికి కాంగ్రెసు పార్టీ పూర్తి ప్రయత్నాలు చేస్తోంది. గత కొన్ని వారాలుగా కాంగ్రెసు పార్టీ మైనారిటీ డిక్లరేషనుపై పనిచేస్తోంది. తెలంగాణ ఎన్నికల్లో గెలవడానికి మైనారిటీ డిక్లరేషన్ వ్యూహాత్మకంగా చాలా ఉపయోగ పడుతుందని భావిస్తున్నారు.

## ముస్లిములను బుజ్జగిస్తున్న మోడీ రాజకీయాలు

ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీ దేశంలోని ముస్లిము సముదాయాన్ని ఆకట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. అక్టోబర్ 13వ తేదీన పార్టీ మైనారిటీ విభాగం సూఫీ సంవాద్ మహా అభియాన్ లక్నోలో నిర్వహించింది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ముస్లిములను ఆకట్టుకోడానికే ఈ ప్రయత్నాలని చాలా మంది భావిస్తున్నారు. 'నా దూరీ హై, నా ఖాయీ హై, మోడీ హమారా భాయీ హై' అనే నినాదం కూడా ఇప్పుడు వినిపిస్తోంది. అంటే అర్థం ఇప్పుడు దూరం లేదు, మోడీ మన సోదరుడు అని. ముస్లిం సముదాయంలో మోడీకి మంచి పేరు తీసుకొచ్చే ఎత్తుగడలు మొదలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో మైనారిటీ వ్యవహారాల మంత్రి డానిష్ అన్సారీ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్‌లోని యోగీ ప్రభుత్వం రెండు కూడా ముస్లిముల స్థితిగతులను బాగు చేయడానికి చాలా కష్టించి పనిచేస్తున్నాయట. కాని ఈ ప్రయత్నాలు కేవలం కంటి తుడుపు చర్యలని, ఎన్నికల ఎత్తుగడలని చాలా మంది విమర్శిస్తున్నారు. ముస్లిం వ్యతిరేక హింసాకాండను బీజేపీ ఎన్నడూ వ్యతిరేకించలేదు. ముస్లిం విద్వేషానికి బీజేపీ నేతలు ఆజ్యం పోస్తూ వస్తున్నారు. ముస్లిములపై జరుగుతున్న విద్వేష నేరాలను బీజేపీ ఎన్నడూ పట్టించుకోలేదు. పైగా బీజేపీ నేతలు ముస్లిం విద్వేష నేరాలకు పాల్పడిన వారికి బాహాటంగా మద్దతిచ్చిన సంఘటనలు న్నాయి. దేశంలో మతపరమైన చిచ్చుపెట్టే రాజకీయాలే బీజేపీ నడిపిందని చాలా మంది విశ్లేషించి చెబుతున్నారు. ఉదాహరణకు పౌరసత్వ సవరణ చట్టం విషయంలో, ఎన్నార్సీ విషయంలో ముస్లిం వ్యతిరేకతను బీజేపీ బాహాటంగానే ప్రదర్శించింది. అంతేకాదు, మూకహత్యలు, ముస్లిములపై హింసాత్మక దాడుల సంఘటనలు జరిగినప్పుడు బీజేపీ మౌనం వహిస్తూ వస్తోంది. ఇలాంటి పార్టీ ఇప్పుడు ముస్లిముల గురించి మాట్లాడడంలో నిజాయితీ లేదని పలువురి అభిప్రాయం. బీజేపీ త్రిపుల్ తలాక్ నిషేధించి ముస్లిం మహిళలకు చాలా మేలు చేసినట్లు చెప్పుకుంటుంది. కాని త్రిపుల్ తలాక్ నిషేధం వల్ల ఎంతమంది ముస్లిం మహిళలకు, ఎంత శాతం మందికి ఎలాంటి ప్రయోజనం లభించిందన్న లెక్కలేమీ లేవు. ముస్లిముల పట్ల వివక్షను తొలగించడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలేవీ లేవు. పస్మాందా అంటే, వెనుకబడిన ముస్లిముల కాన్ఫరెన్సును బీజేపీ నిర్వహించింది. ఉత్తరప్రదేశ్‌లోని ముస్లిం జనాభాలో 85 శాతం పస్మాందా ముస్లిములే. మతతత్వ, ముస్లిం విద్వేష హింసాకాండల్లో అత్యధికంగా నష్టపోతున్నది కూడా వీళ్ళే. ఇప్పుడు బీజేపీ ముస్లిములను హత్తుకుంటామంటున్నా, మోడీ మనకు సోదరుడని నినాదాలిచ్చినా బహుశా ముస్లిం సముదాయం విశ్వాసం పొందడం సాధ్యపడదని చాలా మంది అభిప్రాయపడు తున్నారు.

## కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెలంగాణలో బీజేపీ వ్యూహం

తెలంగాణలో నవంబర్ 30వ తేదీన ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సారి బిఆరెస్, కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడుతున్నాయి. బీఆరెస్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను బీజేపీ చీల్చుతుందన్న అభిప్రాయాలున్నాయి. ఆ విధంగా బీజేపీ కాంగ్రెస్‌కు నష్టం కలిగిస్తే, బీఆరెస్‌కు లాభం కలిగిస్తుంది. కర్నాటకలో బీజేపీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఇప్పుడు తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లోను అభ్యర్థులను నిలబెట్టాలని భావిస్తోంది. కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికే బీజేపీ ఈ పని చేస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. ఇంతకు ముందు బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించింది. బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేయడమేకాదు, స్వతంత్ర అభ్యర్థులకు కూడా మద్దతివ్వడం ద్వారా కాంగ్రెసు గెలుపును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుందని పలువురి అభిప్రాయం. తెలంగాణలో బీజేపీ గెలవడానికి కాదు, కాంగ్రెసును ఓడించడానికి మాత్రమే పోటీచేస్తుందని పలువురు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణలో కాంగ్రెసు చాలా బలపడిందని చాలా మంది భావిస్తున్నారు. తెలంగాణ ఎన్నికలతో పాటు కాంగ్రెస్ ఇప్పుడు 2024 ఎన్నికలపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ముస్లిం ఓటర్లు బీఆరెస్ వైపు గత ఎన్నికల్లో మొగ్గు చూపారు. ఈసారి కూడా ముస్లిములు బీఆరెస్ పక్షానే ఓటు వేసేలా కూడా బీజేపీ వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. బీఆరెస్ కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి అనేక బిల్లులపై మద్దతిచ్చిన పార్టీ అన్నది గుర్తుంచుకోవాలి.

## రక్తమోడుతున్న పశ్చిమాసియా - గాజాపై ఇజ్రాయిల్ అమానుష దాడులు

ఇస్రాయిల్, గాజాల మధ్య పోరు తీవ్రమయ్యింది. ఇస్రాయిల్ పాలస్తీనా సాధారణ ప్రజలపై అమానుష దాడులకు పాల్పడుతోంది. గత 24 గంటల్లో 320 మంది పాలస్తీనా ప్రజలు ఇస్రాయిల్ వైమానిక దాడులలో మరణించిన వార్తలు వచ్చాయి. గాజా వదిలి వెళ్ళిపోతున్న ప్రజల వాహనాలపై ఇస్రాయిల్ బాంబులు కురిపించిన వార్తలు వచ్చాయి. ఒక పాలస్తీనా యువకుడి చేతుల్లో గాయపడిన అమ్మాయి చిత్రం హృదయ విదారకమైనది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నుంచి ఈ చిత్రం వచ్చింది. ఈ ప్రాంతంలో ఎలాంటి ఘోరమైన పరిస్థితులున్నాయో చాటి చెప్పే చిత్రమిది. ఇస్రాయిల్ యుద్ధనేరాలకు పాల్పడుతుందంటూ ఈరాన్ తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాదు, ఈ దాడులు కొనసాగిస్తే భయంకరమైన భూకంపాన్ని ఆహ్వానించడమే అంటూ యుద్ధంలో తాను కూడా ప్రవేశించవచ్చన్న సూచనలు అందించింది. ఈ ప్రాంతంపై ఇస్రాయిల్ దారుణాలు ఇప్పుడు ప్రపంచం చూస్తోంది. అంతర్జాతీయంగా ఆందోళన పెరుగుతోంది. ఈరాన్ మాత్రమే కాదు లెబనాన్ లోని హిజ్బుల్లా గ్రూపు కూడా రంగప్రవేశం చేసేలా కనిపిస్తోంది. గాజాలో ఇస్రాయిల్ తన యుద్ధనేరాలను మానుకోకపోతే పూర్తిస్థాయి యుద్ధానికి హిజ్బుల్లా కూడా సిద్ధమే అన్న సంకేతాలు అందిస్తోంది. ఇస్రాయిల్ తక్షణం మిలిటరీ చర్యలు ఆపకపోతే తీవ్రమైన పరిణామాలు తప్పవన్న ఒత్తిడి ఈరాన్ ప్రకటనలో కనిపిస్తోంది. ఇస్రాయిల్ సాధారణ ప్రజలపై అమానుష దాడులను ఆపకపోతే గాజా, ఇస్రాయిల్ మధ్య జరుగుతున్న ఈ పోరు మరింత విస్తరించి చిక్కుముడిగా మారుతుందన్న భయసందేహాలు ఈరాన్ ప్రకటన తర్వాత పెరుగుతున్నాయి. ఇస్రాయిల్, గాజా ప్రస్తుత పోరులో 13వ తేదీ చాలా విషాదకరమైనది. అత్యంత హృదయవిదారకమైన వార్తలు వచ్చాయి. అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ హింసాత్మక పోరాటంలో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకోవడమే కాదు అత్యంత తీవ్రమైన మానవీయ సంక్షోభాన్ని సృష్టించింది. గాజాలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థలు తక్షణం కాల్పుల విరమణ పాటించాలని పిలుపునిస్తున్నారు. వివాద పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేయడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారు. గడిచే ప్రతి గంట భరించరానిదిగా మారుతోంది. అంతర్జాతీయ సమాజం పశ్చిమాసియాలో పరిస్థితులను చాలా నిశితంగా గమనిస్తోంది, శాంతిని స్థాపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని మరోవైపు యుద్ధం మరింత ఉధృతం అవుతోంది. ప్రాంతీయ స్థిరత్వానికి, ప్రపంచ శాంతికి ఇది పెద్ద విఘాతంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కాల్పుల్లో చిక్కుకున్న సాధారణ ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. అనేకమంది మరణిస్తున్నారు. పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు, ఆసుపత్రుల్లో రోగులు ఇస్రాయిల్ దాడుల్లో మరణిస్తున్న వార్తలు వస్తున్నాయి. అల్ జజీరా చానల్‌కు చెందిన ఉబైద్ సిద్దీకీ, జోసెఫ్ స్టెపాన్స్కీ, ఫెడరికా మార్సి, దాలియా హతుకాలు ఈ ప్రాంతంలో ఎలాంటి పరిస్థితులున్నాయో రిపోర్టు చేశారు. ఇస్రాయిల్ గాజా మధ్య కొనసాగుతున్న పోరు ఈ ప్రాంతంలో శాంతి స్థాపన అనేది ఎంత సున్నితమైన విషయమో మరోసారి చాటి చెబుతోంది. ఇస్రాయిల్ గాజాల మధ్య ఘర్షణ ఇప్పుడు గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుంది. తక్షణం అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.




### గాజాకు శాంతిదళం పంపిస్తామంటున్న చెచెన్యా నాయకుడు

రష్యా అధ్యక్షునికి సన్నిహిత మిత్రుడు, చెచెన్యా నాయకుడు రమజాన్ కడిరోవ్ పాలస్తీనాకు తన పూర్తి మద్దతు ప్రకటించాడు. గాజాకు శాంతిదళంగా తమ దళాలను పంపించగలమని కూడ ప్రతిపాదించాడు. హమాస్ ఇస్రాయిల్‌పై దాడి చేసిన తర్వాత ఇస్రాయిల్ గాజాపై వైమానిక దాడులు జరుపుతోంది. ఈ సందర్భంగా చెచెన్యా నాయకుడు మాట్లాడుతూ ముస్లిం దేశాల నేతలకు పిలుపిచ్చాడు. ముస్లిం దేశాల పాలకులు తమ మిత్రులుగా భావిస్తున్న పాశ్చాత్య దేశాల నేతలతో మాట్లాడి సాధారణ పౌరులపై బాంబులు వేయకుండా ఆపించాలని అన్నారు. హమాస్ పై యుద్ధం పేరుతో సాధారణ ప్రజల హత్యలను ఆపాలని చెప్పాడు. తాము పాలస్తీనాకు మద్దతిస్తున్నామని, ఈ యుద్ధానికి తాము వ్యతిరేకమని కూడా చెప్పాడు. ఈ యుద్ధం ఇతర ప్రాంతాలకు విస్తరించే ప్రమాదముందని హెచ్చరించాడు. అవసరమైతే తమ దళాలు శాంతిదళంగా గాజాలో ప్రవేశించి శాంతిభద్రతలను కాపాడతామని, హింసాకాండకు పాల్పడేవారిని అడ్డుకుంటామని అన్నాడు. హమాస్ చేసిన దాడిలో జెరుసలేం దగ్గరిలోని అక్మత్ కదిరోవ్ మస్జిదు కూడా దెబ్బతింది. ఈ మస్జిదును చెచెన్యా నాయకుడు రమజాన్ కదిరోవ్ తన తండ్రి అక్మత్ కదిరోవ్ పేరున కట్టించాడు. హమాస్ దాడిలో ఈమస్జిదుకు నష్టం కలిగిందన్న విషయాన్ని ఆయన కూడా అంగీకరించాడు. ఈ మస్జిదు ఇస్రాయిల్ ఆక్రమణలో ఉన్న అబూఘోష్ గ్రామంలో ఉంది. గత సంవత్సరం రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో చెచెన్యా దళాలను సమీకరించి రష్యాకు మద్దతుగా రంగంలోకి దించాడు రమజాన్ కదిరోవ్. కొన్ని పత్రికల కథనాల ప్రకారం రష్యా ఇంకా అధికారికంగా గాజా విషయంలో ఎవరి పక్షం వహించాలన్నది తేల్చుకోలేదు. హమాస్ దాడి వెనుక రష్యా మద్దతు కూడా ఉండవచ్చని చాలా మంది అనుమానిస్తున్నారు. ఇస్రాయిల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థను నవ్వుల పాలు చేసింది హమాస్. రమజాన్ కదిరోవ్ ప్రకటన తర్వాత రష్యా ప్రతినిధి డిమిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ రష్యా రెండు దేశాలతోను, పాలస్తీనా, ఇస్రాయిల్ రెండు దేశాలతోను సంబంధాలు కొనసాగిస్తుందని అన్నాడు. పాలస్తీనాతో సుదర్ఘ కాలంగా బలమైన సంబంధాలున్నాయని, అయితే ఇస్రయిల్ తోను సంబంధాలున్నాయని, ఇస్రాయిల్‌లో చాలా పెద్ద సంఖ్యలో రష్యా దేశస్తులున్నారని కూడా చెప్పాడు. అందువల్ల రష్యా ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుందని స్పష్టమవుతోంది.

## పశ్చిమాసియా విషయంలో పప్పులో కాలేసిన ప్రధాని

ఇస్రాయీల్, పాలస్తీనా ఘర్షణల నేపథ్యంలో ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ తీసుకున్న వైఖరిని పలువురు విమర్శిస్తున్నారు. భారతదేశం చారిత్రకంగా పాలస్తీనాకు మద్దతిస్తూ వస్తోంది. దీనికి భిన్నంగా ప్రధాని ఇస్రాయీల్‌కు తన సంఘీభావాన్ని ప్రకటిస్తూ వెంటనే ప్రకటన విడుదల చేశారు. నిజానికి పాలస్తీనా విమోచన సంస్థను 1974లోనే భారతదేశం గుర్తించింది. పిఎల్ఓను గుర్తించిన మొట్టమొదటి అరబ్బేతర దేశం ఇండియా. పాలస్తీనాను గుర్తించిన మొట్టమొదటి దేశాల్లో ఇండియా కూడా ఉంది. 1988లో పాలస్తీనాకు గుర్తింపు ఇచ్చింది. కాని 2014లో మోడీ అధికారం లోకి వచ్చిన తర్వాతి నుంచి ఇస్రాయీల్ వైపు మొగ్గు ఎక్కువ య్యింది. 2017 జులైలో ప్రధాని టెల్ అవీవ్ సందర్శించారు. కాని పాలస్తీనాకు వెళ్ళలేదు. ప్రధాని మోడీ ఎవరివైపు మొగ్గు చూపుతున్నారో అప్పుడే చాలా స్పష్టంగా తెలిసింది. ఇటీవల ఇస్రాయీల్ హమాస్ మధ్య ఘర్షణ ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని మోడీ క్షణం ఆలస్యం చేయకుండా సోషల్ మీడియాలో ఇస్రాయీల్‌కు తన సంఘీభావాన్ని ప్రకటించారు. ఆ తర్వాత ఇస్రాయీల్ ప్రధానితో ఫోనులో కూడా మాట్లాడారు. ఇస్రాయీల్‌కు పూర్తి మద్దతు ఇస్తానన్నారు. భారత విదేశాంగ శాఖ తర్వాత తాము స్వతంత్ర పాలస్తీనా ఏర్పడాలని కోరుతు న్నట్లు చేసిన ప్రకటన దౌత్యపరమైన తప్పటడుగును సరిదిద్దుకునే చర్యగా చాలామంది భావిస్తున్నారు. కొందరైతే ఇది కేవలం లాంఛనప్రాయమైన ప్రకటన మాత్రమే అని, అసలు విధానం మోడీ చేసిన ప్రకటనలోనే ఉందంటున్నారు. కాని ఈ ద్వంద్వవైఖరి సమస్యలతో కూడుకున్నది. ఇస్రాయీల్‌కు బాహాటంగా మద్దతివ్వడం ద్వారా ప్రధాని దురాక్రమక సైన్యానికి మద్దతిచ్చారు. పాలస్తీనాపై ఇస్రాయీల్ దౌర్జన్యాలను అంతర్జాతీయ సమాజం నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది. కాని, ఇస్రాయీల్ నుంచి ఏటా భారతదేశం 1 బిలియన్ డాలర్ల యుద్ధసామాగ్రి కొనుగోలు చేస్తోంది. మోడీ హయాంలో భారత విదేశాంగ నీతి మారుతుందా? నైతిక నిబద్ధతను వదిలి వ్యూహాత్మక ప్రయోజనాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారా? పాలస్తీనా విషయంలో గట్టిగా నిలబడకపోవడం, అణిచివేతలకు గురైనవారు, తమ దేశంలోనే తమ భూమిని, తమ హక్కులను కోల్పోయిన వారి పక్షాన మాట్లాడక పోవడం అనేది దౌత్యపరమైన తప్పటడుగుగా చాలా మంది భావిస్తున్నారు. న్యాయానికి, మానవ హక్కులకు మద్దతిచ్చే దేశంగా భారత ప్రతిష్ఠను ఈ వైఖరి దెబ్బతీసిందని చాలా మంది విమర్శిస్తున్నారు. పాలస్తీనా విషయంలో సుదీర్ఘకాలంగా భారతదేశం కట్టుబడిన విధానాన్ని ఇప్పుడు తుంగల్లో తొక్కడం జరిగిందా? భారతదేశం అనుసరించే విదేశీనీతి, ప్రపంచ రాజకీయాల్లో భారతదేశం పోషించే పాత్ర, వీటి వెనుక ఉన్న నైతిక పునాదులపై ఇప్పుడు ప్రశ్నలు పుడుతున్నాయి.

## అయోధ్య మస్జిదు నిర్మాణంలో మరింత జాప్యం

అయోధ్యలో ప్రతిపాదించిన మస్జిదు నిర్మాణం మరింత ఆలస్య మయ్యేలా కనిపిస్తోంది. అయోధ్య మస్జిదు విషయంలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. డిజైను విషయంలో ముస్లిం సముదాయం నుంచే చాలా అభ్యంతరాలు వచ్చాయి. బాబరీ మస్జిదు వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఈ నాలుగేళ్ళ కాలంలో మస్జిదు నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా పెట్టడం జరగలేదు. ఈ మస్జిదుకు ముహమ్మద్ బిన్ అబ్దుల్లా మస్జిదుగా పేరుపెట్టారు. మొత్తం 4500 చదరపు గజాల స్థలంలో కడుతు న్నారు. ఉత్తరప్రదేశ్ సున్నీ వక్ఫ్ బోర్డు చైర్మన్ జఫర్ అహ్మద్ ఫారూకీ అక్టోబర్ 13వ తేదీన కొత్త డిజైను తీసుకొచ్చారు. ముంబైలోని రంగ్ షారదా హాలులో ఈ డిజైను ప్రకటించారు. పూనేకు చెందిన ఇమ్రాన్ షేక్ అనే ఆర్కిటెక్ట్ ఈ డిజైను తయారు చేశారు. ఇంతకు ముందు డిజైనులో సంప్రదాయిక ఇస్లామీయ ఆర్కిటెక్చర్ లేదు. డోములు, ఆర్చిలు లేవు. ఇప్పుడు కొత్త డిజైనులో ఇవన్నీ చేర్చారు. చూడగానే ముస్లిం ఆరాధనాలయంగా కనిపించేలా డిజైను మార్చారు. ఇందులో మినార్లు, నెలవంక వంటివి కూడా చేర్చారు. ఇంతకు ముందు డిజైనులో మస్జిదె అయోధ్య అని పేరు పెట్టారు. ఆ డిజైనును యస్.ఎం.అక్తర్ రూపొందించారు. ఢిల్లీలోని జామియా మిల్లియా విశ్వవిద్యా లయం ఆర్కిటెక్చర్ విభాగం ఫౌండర్ డీన్‌గా ఆయన పనిచేసిన వ్యక్తి. ఇందులో ఒక ఆసుపత్రి, కమ్యునిటి కిచెన్, లైబ్రరీ, పరిశోధనాలయం కూడా ఉన్నాయి. 1857 సిపాయిల తిరుగు బాటు స్వతంత్రయోధుడు మౌల్వీ అహ్మదుల్లా షా పేరుతో లైబ్రరీ, పరిశోధనాలయం కడుతున్నారు. మస్జిదు నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి ఇండో ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్‌ను సున్నీ వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ధన్నీ పూర్‌లో 5 ఎకరాల స్థలం కేటాయించింది. ఈ స్థలం అయోధ్యకు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాని ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్‌లో ఎవ్వరికి కూడా కొత్త డిజైను నచ్చలేదు. ఎందుకంటే పాత డిజైనులో లౌకికతత్వం ఉందని వీళ్ళు భావిస్తున్నారు. ఏది ఏమైనా అయోధ్య మస్జిదు నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు. మస్జిదు నిర్మాణానికి విరాళాల సేకరణ ప్రారంభిస్తామని అంటున్నారు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**